

తెలుగు వార్త వార పత్రిక

RNI : APTEL/2006/16523

సత్తెనపల్లి న్యూస్

సామాజిక హితం | ప్రజాప్రగతి


సంపుటి : 21 | సంచిక : 47 | 23.11.2026 నుంచి 29.11.2026 | పేజీలు : 8 | వెల రూ. 3 | sapnews.in@gmail.com |





- సర్పంచి పీఠానికి కోట్లలో ధర!
- ఏకగ్రీవ ఎన్నిక కోసం లక్షలు, కోట్ల రూపాయల హామీలు
- ఎక్కడికక్కడ పోటాపోటీగా పాటలు.. గ్రామాభివృద్ధి, ఆలయాలకు నిధుల ప్రకటనలు
- భూములు, వంతెనల నిర్మాణాలకూ అభ్యర్థుల హామీలు

అమరావతి: గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ సర్పంచి పదవులకు అనూహ్యమైన డిమాండ్ ఏర్పడుతోంది. ఎన్నికల బరిలో నిలిచి ఓట్ల ద్వారా గెలవడం కంటే, గ్రామస్థుల సమక్షంలో జరిగే వేలం పాటల్లో భారీ మొత్తాలు వెచ్చించి పదవిని దక్కించుకోవడానికే కొందరు అభ్యర్థులు మొగ్గుచూపుతున్నారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి సొంత నిధులు ఖర్చు చేస్తామని హామీలిస్తున్నారు. ఈ క్రమంలో లక్షల రూపాయలతో మొదలైన వేలం పాటలు కోట్లకు చేరుతున్నాయి. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ సర్పంచి పదవికి ఏకంగా రూ.2.30 కోట్ల ధర పలకడం ఈ పోటీ తీవ్రతకు అద్దం పడుతోంది.



ఓట్లతో పనిలేదు..

కోట్లే ముద్దు!

కోట్లలో పలికిన పదవులు

చల్లారెడ్డిపాలెం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, కొత్తపాలెం గ్రామాలతో కూడిన చల్లారెడ్డిపాలెంలో ఈసారి ఒప్పందం ప్రకారం కఠారివారిపాలేనికి సర్పంచి పదవి దక్కాల్సి ఉంది. అయితే పదవి కోసం పోటీ పెరగడంతో నిర్వహించిన వేలం పాటలో ఓ గ్రామస్థుడు రూ.2.30 కోట్లు వెచ్చించేందుకు ముందుకొచ్చారు. విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలోనూ సర్పంచి పదవికి భారీ పోటీ నెలకొంది. టీడీపీ అభ్యర్థి నెరుసు నిఖిల్ యాదవ్ రూ.1.20 కోట్లకు వేలంలో పదవిని దక్కించుకున్నారు. ఈ మొత్తాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలోనూ సర్పంచి పదవికి భారీ ధర పలికింది. జనరల్ మహిళకు కేటాయించిన ఈ పదవికి స్థానిక శివాలయంలో బహిరంగ వేలం నిర్వహించగా, ఓ వ్యక్తి రూ.1.20 కోట్లకు పాట పాడారు. గతంలోనూ రెండుసార్లు వేలం నిర్వహించిన ఈ గ్రామంలో తాజా వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆలయాల అభివృద్ధికి ఖర్చు చేయాలని నిర్ణయించారు. వేలంలో అత్యధిక మొత్తం చెల్లించేందుకు ముందుకొచ్చిన అభ్యర్థికి వ్యతిరేకంగా ఎవరైనా నామినేషన్ వేసినా, ఆయననే గెలిపించాలని, వార్డు సభ్యుల ఎన్నికలను సైతం ఏకగ్రీవం చేయాలని గ్రామ పెద్దలు తీర్మానించినట్లు తెలుస్తోంది. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం జొన్నలగడ్డలో సర్పంచి పదవికి ముగ్గురు అభ్యర్థులు పోటీపడ్డారు. కొరిటాల గోపాలరావు, యర్రా శ్రీనివాసరావు, చెరుకూరి ఏడుకొండలు మధ్య జరిగిన వేలం పోటీలో చివరకు యర్రా శ్రీనివాసరావు రూ.81 లక్షలకు పదవిని దక్కించుకున్నారు.

ఆలయాల అభివృద్ధే లక్ష్యంగా..

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం పల్లెదొడ్డిలో మారెమ్మ ఆలయ నిర్మాణానికి నిధులు సమకూర్చాలనే ఉద్దేశంతో సర్పంచి పదవికి వేలం నిర్వహించారు. ఈ పోటీలో బోయ ఖాసీం రూ.32.50 లక్షలకు పాట పాడి పదవిని దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం కొప్పలకొండలోనూ రామాలయ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని వేలం నిర్వహించారు. అత్యధిక మొత్తం చెల్లించేందుకు ముందుకొచ్చిన వ్యక్తినే ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని గ్రామస్థులు నిర్ణయించడంతో పలువురు పోటీపడ్డారు. చివరకు ఎల్ఐసీ ఆదినారాయణ రూ.29 లక్షలకు సర్పంచి పదవిని దక్కించుకున్నారు. చీరాల మండలం పిట్టువారిపాలెంలోనూ సర్పంచి పదవికి రూ.25 లక్షలు ధర పలికింది.

గ్రామాభివృద్ధికి లక్షల విరాళాలు

ఏలూరు జిల్లా నిడమర్రు మండలం బువ్వనపల్లిలో సర్పంచి ఎన్నిక ఏకగ్రీవమైంది. గ్రామాభివృద్ధికి రూ.75 లక్షలు అందించేందుకు సంకు నాగశేషు ముందుకు రావడంతో ఆయనను సర్పంచిగా ఎంపిక చేయాలని గ్రామస్థులు నిర్ణయించారు. మార్కాపురం జిల్లా నికరంపల్లిలోనూ సర్పంచి పదవికి ఆదివారం రాత్రి వేలం నిర్వహించారు. ఐదుగురు అభ్యర్థులు పోటీపడగా, చివరకు చదలవాడ వెంకట రామిరెడ్డి రూ.61.20 లక్షలకు పదవిని దక్కించుకున్నారు. ఈ మొత్తాన్ని గ్రామంలోని రామాలయం, మసీదు, చర్చిల అభివృద్ధికి వినియోగించాలని గ్రామస్థులు నిర్ణయించడం విశేషం. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం రామానాయుడుపల్లిలో సర్పంచి పదవికి రూ.58.05 లక్షలు ధర పలికింది. వేలంలో టీడీపీ నేత కొప్పోలు వెంకటేశ్వర్లు ఈ మొత్తానికి పాట పాడి పదవిని దక్కించుకున్నారు. గత ఎన్నికల్లోనూ ఇదే గ్రామంలో వేలం పద్ధతిలో సర్పంచిని ఎంపిక చేయడం గమనార్హం.

భూములు ఇస్తాం.. వంతెనలు కడతాం!

మరోవైపు పశ్చిమగోదావరి జిల్లాలో సర్పంచి పదవుల కోసం అభ్యర్థులు వినూత్న హామీలతో ముందుకొస్తున్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్పలో తన భార్య రామలక్ష్మిని గ్రామస్థులంతా ఏకగ్రీవంగా సర్పంచిగా ఎన్నుకుంటే పంచాయతీకి రెండెకరాల భూమిని రాసిస్తానని గ్రామ ప్రముఖుడు కొప్పర్తి శ్రీరామ్మూర్తి ప్రకటించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి చెరువు సమస్యను పరిష్కరించేందుకు ఈ భూమిని అందించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. తన భార్యతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటికే గ్రామ పెద్దలు, ప్రజలతో సమావేశమై తన నిర్ణయాన్ని తెలియజేసినట్లు పేర్కొన్నారు. పాలకోడేరు మండలం కొండేపూడిలోనూ సర్పంచి అభ్యర్థి పాలా సురేశ్ కీలక హామీ ఇచ్చారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామానికి, శ్మశానానికి మధ్య ఉన్న జీఅండ్‌వీ పంట కాలువపై కాలిబాట వంతెన నిర్మిస్తానని ప్రకటించారు. ప్రస్తుతం కాలువను దాటేందుకు స్థానికులు ఫైబర్ పడవలను ఆశ్రయిస్తున్నారు. ప్రవాహ ఉద్ధృతి పెరిగినప్పుడు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ గ్రామస్థులు కొన్నేళ్లుగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచిగా అవకాశం కల్పిస్తే వంతెన నిర్మాణ బాధ్యత తీసుకుంటానని సురేశ్ హామీ ఇచ్చారు. మొత్తంగా తొలి దశ పంచాయతీ ఎన్నికల వేళ గ్రామాల్లో సర్పంచి పదవుల కోసం సాగుతున్న పోటీ ఆసక్తికర మలుపులు తిరుగుతోంది. ఎక్కడో వేలం పాటల్లో కోట్ల రూపాయలు పలుకుతుంటే.. మరికొన్ని చోట్ల గ్రామాభివృద్ధి కోసం భూములు, వంతెనల నిర్మాణం వంటి హామీలు తెరపైకి వస్తున్నాయి. ప్రజాసేవకు వేదిక కావాల్సిన సర్పంచి పదవులు వేలం పాటల స్థాయికి చేరడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

కూటమి ఐక్యత శాశ్వతం కావాలి.. పాత్తు ధర్మం పాటించాలి: చంద్రబాబు



అమరావతి: స్థానిక ఎన్నికల్లో ప్రతి వార్డులోనూ కూటమి జెండా ఎగరాలని తెలుగుదేశం అధినేత చంద్రబాబు .. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తల్లి, చెల్లి వ్యక్తిత్వాన్ని కించ పరిచే వారు రాజకీయాలకు అనర్హులని ఘాటుగా వ్యాఖ్యానించారు. వ్యక్తిత్వం లేని వారు చెల్లిని అగౌరపరిచేలా వ్యవహరిస్తూ రాజకీయ ముసుగులో తిరుగుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు వాస్తవాలను వివరించి ప్రతి ఎన్నికలోనూ కూటమి విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పంచాయతీ, రెండో దశ పట్టణ ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. తెలుగుదేశం నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఎన్నికల వ్యూహంపై చర్చించారు. కూటమి ఐక్యత శాశ్వతంగా కొనసాగాలని, పొత్తు ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం కంటే ఈసారి గణనీయంగా పెరగాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఒక్క వార్డులో ఓడినా అందుకు గల కారణాలను విశ్లేషిస్తానని హెచ్చరించారు. గ్రామాలు, నియోజకవర్గాల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని పరిశీలించి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని చంద్రబాబు తేల్చి చెప్పారు.

డబ్బు తీసుకుంటారా.. దెబ్బలు తింటారా?

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో కూటమి నాయకులు బెదిరింపుల పర్వానికి దిగారు. ఎన్నికల ప్రకటన విడుదలైనప్పటి నుంచి దాడులు.. దౌర్జన్యాలతో రెచ్చిపోయిన కూటమి నేతలు రెండున్నరేళ్లలో సంపాదించిన అక్రమ సంపాదనతో డబ్బు ఎదజల్లేందుకు సిద్ధమైపోయారు. మాట వినని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అభ్యర్థులను బెదిరింపులతో లొంగదీసుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారు.

మొదటి నుంచి అరాచకమే : శ్రీకాళహస్తి పురపాలక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి కూటమి నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారు. మొదట్లో వైఎస్సార్‌సీపీ తరపున ఒక్క నామినేషన్ కూడా దాఖలు చేయలేరంటూ ప్రచారం చేసినప్పటికీ, అన్ని అడ్డంకులను అధిగమించి 44 వార్డులకు గాను 140 నామినేషన్లను ఆ పార్టీ అభ్యర్థులు దాఖలు చేశారు. నామినేషన్లు వేసేందుకు వచ్చిన అభ్యర్థులను అడ్డుకోవడం, ఇబ్బందులకు గురిచేయడం, నామినేషన్ పత్రాలను చించివేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నా ఎక్కడా వెనక్కి తగ్గలేదు.

42 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ పోటీ : నామినేషన్ల పరిశీలన సమయంలో నిబంధనల ప్రకారం అన్ని వివరాలతో పక్కాగా దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను సైతం తిరస్కరించేందుకు అధికారులపై కూటమి నేతలు ఒత్తిళ్లు తీసుకొచ్చారు. ఈ క్రమంలో మొత్తం తొమ్మిది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వాటిలో అన్ని అర్హతలు, పత్రాలు ఉన్న రెండు నామినేషన్లను సైతం తొలగించారని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ 42 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. దీంతో ప్రత్యర్థి శిబిరంలో ఆందోళన మొదలైంది.



డబ్బు తీసుకుంటారా.. దెబ్బలు తింటారా? : ఎలాగైనా వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అభ్యర్థులను పోటీ నుంచి తప్పించాలనే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొందరు అభ్యర్థులకు డబ్బు ఆశ చూపుతూ విత్‌డ్రా చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని, వాటికి లొంగని వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. అభ్యర్థులను భయభ్రాంతు లకు గురిచేసి పోటీ నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతు న్నాయని పేర్కొంటున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాల్సిన తరుణంలో బెదిరింపులు, ప్రలోభాలకు తెరలేపడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎన్నికల అధికారులు, పోలీసు యంత్రాంగం స్పందించి అభ్యర్థులకు భద్రత కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పల్నాడులో ఉద్రిక్తత.. మహిళలపై పోలీసుల లాఠీఛార్జ్!



పల్నాడు: ఏపీలో కూటమి సర్కార్ పాలనలో పల్నాడు జిల్లాలో పోలీసులు మరోసారి రెచ్చిపోయారు. నామినేషన్లు వేసేందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. అభ్యర్థులను అక్రమంగా పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా గ్రామానికి చెందిన మహిళలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో మహిళలపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. పల్నాడు జిల్లాలోని పెదకూరపాడు నియోజకవర్గంలో నామినేషన్ల సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. క్రోసూరు మండలం నాగవరంలో నామినేషన్లు దాఖలు చేసేందుకు అనంతవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. నామినేషన్లు వేసేందుకు వచ్చిన వారిని క్రోసూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సత్తెనపల్లికి తీసుకెళ్లేందుకు పోలీసులు ప్రయత్నించగా గ్రామానికి చెందిన మహిళలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, మహిళలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. నామినేషన్లు దాఖలు చేయకుండా ఎలా అడ్డుకుంటారని మహిళలు పోలీసులను ప్రశ్నించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మహిళలపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నామినేషన్లు వేయకుండా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అడ్డుకు నేందుకే పోలీసులు ప్రయత్నిస్తున్నారని పార్టీ నేతలు మండిపడ్డారు. ఈ పరిణామాలతో నాగవరంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఏపీలో మూడో దశ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల



అమరావతి: ఏపీలో మూడో దశ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈనెల 21 నుంచి 23 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 24న నామినేషన్ల పరిశీలన చేపడతారు. నామినేషన్ల ఉపసంహరణకు 27 తుది గడువు. డిసెంబర్ 2న పోలింగ్ నిర్వహించి.. అదే రోజు ఫలితాలను వెల్లడించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరగనుంది.

నాన్‌లోకల్ కోటాకు టాటా

అమరావతి: డీఎస్సీ-2026 దరఖాస్తు ప్రక్రియ అభ్యర్థులకు చుక్కలు చూపుతోంది. అధికారులు చేసిన తప్పిదాలు అభ్యర్థులను కష్టాల పాలుజేస్తున్నాయి. అర్హత ఉన్నా... నాన్--లోకల్ కోటాకు దరుఖాస్తు చేసుకోకుండా చేశారు. తాజా నోటిఫికేషన్‌లో ప్రకటించిన పోస్టులు చాలా తక్కువ. కేవలం 2,721 పోస్టుల్లో ఓ ఐదు జిల్లాల్లో ఒక్క పోస్టు కూడా లేదు. మరో 16 జిల్లాల్లో 10 లోపే ఉన్నాయి.

దీంతో నాన్--లోకల్ కోటా కింద దరఖాస్తుకు ప్రయత్నిస్తే కుదరడం లేదు. అభ్యర్థులు లోకల్, లేదా నాన్--యులోకల్‌లో ఏదో ఒక్క జిల్లాను మాత్రమే ఎంచుకునేలా ఇచ్చారు. దీనిపై పాఠశాల విద్యాశాఖ, డీఎస్సీ నిర్వహణ అధికారులు సరైన సమాధానం ఇవ్వడం లేదని అభ్యర్థులు వాపోతున్నారు. అయితే, మెగా డీఎస్సీ--2025లో పోస్టుల ప్రిఫరెన్స్ ప్రయారిటీ దరఖాస్తు సమయంలోనే తీసుకున్న అధికారులు, వాటిని మార్చుకునే అవకాశం ఇవ్వలేదు. ఈసారి మెరిట్ లిస్టు విడుదలయ్యాక మార్కులు ఆధారంగా పోస్టుల ప్రాధాన్యం మార్చుకునేందుకు అవకాశం కల్పించారు.

నాన్-లోకల్ కోటాకు అర్హత లేదా?

తాజా నిబంధనల ప్రకారం లోకల్ కోటా పోస్టులు 95 శాతం స్థానిక అభ్యర్థులకే కేటాయించారు. కేవలం 5 శాతం మాత్రమే నాన్--లోకల్ కోటాలో ఉన్నాయి. సాధారణంగా లోకల్‌లో పోటీ ఎక్కువ ఉన్నప్పుడు నాన్--లోకల్ కింద ఇతర జిల్లాల్లో దరఖాస్తు చేసుకుంటారు. ఈ క్రమంలో అభ్యర్థికి వచ్చిన మార్కులు ఆధారంగా నాన్--లోకల్‌లో ఎన్ని జిల్లాలకైనా దరఖాస్తు చేసుకుంటారు.

ఇందుకోసం దరఖాస్తు సమయంలోనే అదనపు ఫీజు తీసుకుంటారు. కానీ, డీఎస్సీ--2026లో మాత్రం లోకల్ అభ్యర్థులు నాన్--లోకల్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వీలు లేకుండా చేశారు. మరి ఈ ఐదు శాతం పోస్టులు ఎవరితో భర్తీ చేస్తారన్నది సమాధానం లేని పెద్ద ప్రశ్నగా మారింది. అసలు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేనప్పుడు ఐదు శాతం నాన్--లోకల్ రిజర్వేషన్ ఎందుకిచ్చారో చెప్పడం లేదు.

నాడు అన్ని జిల్లాలకు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 1.34 లక్షల సచివాలయ ఉద్యోగాలు ఇచ్చినప్పుడు కూడా ఇలాంటి పరిస్థితి లేదు. అభ్యర్థులు తమ సొంత జిల్లా(లోకల్)తో పాటు నాన్--లోకల్ కింద అన్ని జిల్లాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. తాజా డీఎస్సీ దరఖాస్తు ఫీజును రూ.వెయ్యికి పెంచినా అవకాశాలు లేకుండా చేశారని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

'నీట్'లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ?

న్యూఢిల్లీ: నీట్ యూజీ పరీక్ష విధానంలో కీలక మార్పులు తీసుకురావాలనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. నీట్‌లో ఇంటర్మీడియట్ (12వ తరగతి) బోర్డు పరీక్షల మార్కులకు వెయిటేజీ ఇవ్వాలని పలు రాష్ట్రాలు కేంద్రానికి సూచించాయి. నందన్ నీలేకని నేతృత్వంలోని పరీక్షల సంస్కరణల టాస్క్‌ఫోర్స్‌తో నిర్వహించిన సంప్రదింపుల సమావేశాల్లో ఈ ప్రతిపాదన ప్రధానంగా చర్చకు వచ్చినట్లు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వెల్లడించింది.

ప్రస్తుతం వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న నీట్‌లో ఒకే పరీక్షపై ఆధారపడటం వల్ల కోచింగ్ సంస్థలకు ప్రాధాన్యం పెరుగుతోందని రాష్ట్రాలు అభిప్రాయపడ్డాయి. విద్యార్థులు బోర్డు పరీక్షల కంటే కోచింగ్‌పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారని పేర్కొన్నాయి. పదో తరగతి పూర్తయిన వెంటనే కొందరు విద్యార్థులు డమ్మీ కళాశాలల్లో చేరి, పూర్తిగా కోచింగ్ సంస్థలపైనే ఆధారపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి.

విద్యార్థులపై పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు ఏడాదికి ఒకటి కంటే ఎక్కువసార్లు నీట్ నిర్వహించాలని పలు రాష్ట్రాలు సూచించాయి. దీనివల్ల విద్యార్థులకు మరో అవకాశం లభించడంతో పాటు ఒకే పరీక్ష ఫలితంపై ఆధారపడాల్సిన పరిస్థితి తగ్గుతుందని అభిప్రాయపడ్డాయి. ప్రస్తుతం పెన్ అండ్ పేపర్ విధానంలో జరుగుతున్న నీట్‌ను కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)గా మార్చాలని దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు మినహా మిగతా రాష్ట్రాలు మద్దతు తెలిపినట్లు అధికారులు వెల్లడించారు.

విద్యార్థులు పరీక్షల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రతి జిల్లాలో కనీసం ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని రాష్ట్రాలు సూచించాయి. కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కేంద్రం కల్పించాలని కోరాయి. పరీక్షలకు ముందే ప్రశ్నపత్రాల రూపకల్పన చేయకుండా, పరీక్షలకు దగ్గర సమయంలో ప్రశ్నలను సిద్ధం చేయడం, కేంద్ర పరీక్షా సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయడం వంటి సూచనలు కూడా వచ్చాయి. జులై 25న జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆరుగురు సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ప్రకటించారు. నందన్ నీలేకని నేతృత్వంలోని ఈ కమిటీ ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు, జమ్మూకశ్మీర్, ఒడిశాతో సమావేశాలు నిర్వహించింది. త్వరలో ఉత్తరాది రాష్ట్రాలతోనూ చర్చలు జరపనుంది. తొలి రెండు నెలల్లో 18 ఉన్నతస్థాయి సమావేశాలు, 40 సంప్రదింపుల సమావేశాలు నిర్వహించిన ఈ కమిటీకి తొలుత అక్టోబర్ వరకు గడువు ఉండగా, తాజాగా జనవరి 2027 వరకు పొడిగించారు. ఇప్పటివరకు సుమారు 50 వేల సూచనలు అందినట్లు సమాచారం.

కోట్లు వెచ్చించినా కాలుష్య కాసారమే



న్యూఢిల్లీ: యమున నది శుద్ధికి భారీగా నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ దాని పరిస్థితి మరింత దిగజారిందని సుప్రీంకోర్టు సోమవారం అధికార యంత్రాంగాన్ని విమర్శించింది. జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన బెంచ్ మాట్లాడుతూ, నది ఒడ్డున ఉన్న పట్టణాలు, నగరాలు, గ్రామాల్లోని పౌర పాలనా వ్యవస్థల వైఫల్యం యమున దుస్థితిని ప్రతిబింబిస్తున్నదని పేర్కొన్నది. ఆ నదిలోకి మురుగు నీటిని వదులుతున్న 520 డ్రెయిన్లను కోర్టు ప్రస్తావించింది. ప్రధాన డ్రెయిన్లలో, ప్రతి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆ నది నీటి నాణ్యతను కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆదేశించింది. ఆ నది తమ రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతం లేదా జిల్లాల గుండా ప్రవహిస్తున్నప్పుడు నాణ్యత దిగజారితే సంబంధిత అధికార యంత్రాంగంపై చర్యలు తీసుకొని జరిమానా విధిస్తామని కోర్టు హెచ్చరించింది. యమున పరివాహక ప్రాంతమంతటా కాలుష్య నియంత్రణ బాధ్యత రాష్ట్రాలదని..ఒక రాష్ట్రం యమునలోకి ఎంత కాలుష్యాన్ని కలుపుతున్నది, దానిని నియంత్రించే సామర్థ్యం దానికి ఎంత ఉన్నది అనే దానిపై ఆధారపడి ఉంటుందని తెలిపింది.

ఐదు నెలల్లోనే ఆకాశాన్నంటిన బియ్యం ధరలు



అమరావతి : చంద్రబాబు ప్రభుత్వంలో సామాన్యుడి అన్నంముద్దపైనా 'పచ్చ మాఫియా' పడగ విప్పింది. 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా పేరొందిన ఆంధ్రప్రదేశ్‌లో కరువును బూచిగా చూపి తిండిగింజలపైనా దోపిడీకి తెగబడుతోంది. ఒకవైపు సన్నబియ్యం ధరలను ఆకాశానికెత్తి ప్రజల జేబులు గుల్ల చేస్తుంటే.. మరోవైపు రేషన్ బియ్యాన్నే పాలిష్ చేసి సన్నబియ్యం పేరుతో అధిక ధరలకు అంటగడుతోంది. నాసిరకం బియ్యంలో నూకలు కలిపి నాణ్యమైన బియ్యంగా చలామణి చేస్తూ నిలువుదోపిడీ సాగిస్తోంది.

ఈ దందా వెనుక 'నీకింత.. నాకింత' అన్నట్టుగా ప్రతి బస్తాలోనూ వాటాలు పంచుకుంటున్నారు. మంత్రులు చినబాబు, నాదెండ్ల మనోహర్ సహా స్థానిక ప్రజాప్రతినిధులకు బియ్యం మాఫియా నుంచి రోజువారీ ముడుపులు అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో గిరాకీ ఉన్న బ్రాండ్ల బియ్యం ఉత్పత్తి చేసే ఒక్కో రైస్‌మిల్లు నుంచే రూ.100 కోట్లకుపైగా దోపిడీకి పాల్పడుతున్నారన్న చర్చ జరుగుతోంది.

ప్రభుత్వ పెద్దల హస్తం ఉండబట్టే బియ్యం మాఫియాపై కొరడా ఝళిపించాల్సిన పౌరసరఫరాలు, విజిలెన్స్ విభాగాలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. ప్రజల కడుపు కొడుతున్న మాఫియాకు అండగా నిలుస్తున్న చంద్రబాబు సర్కారుపై సామాన్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ జేబులు కొల్లగొడుతున్న ఈ దోపిడీ ప్రభుత్వానికి ఎందుకు ఓటు వేయాలంటూ నిలదీస్తున్నారు.

కృత్రిమ కొరతతో రూ.కోట్ల దోపిడీ

రాష్ట్రంలో ఏటా 60--65 లక్షల టన్నుల బియ్యం వినియోగమవుతోంది. ఇందులో సాధారణ గృహ వినియోగమే 40 లక్షల టన్నులకుపైగా ఉంటుంది. పౌరసరఫరాల విభాగం (పీడీఎస్) ద్వారా ఏటా 28 లక్షల టన్నుల బియ్యం పంపిణీ అవుతోంది. అయితే ఇందులో మూడొంతులకుపైగా బియ్యాన్ని తిరిగి పాలిష్ చేసి బ్రాండెడ్ పేర్లతో రిటైల్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.

ఇటీవలి కాలంలో బీపీటీ, సోనా మసూరి, హెచ్‌ఎంటీ వంటి సూపర్‌ఫైన్ రకాల బియ్యానికి డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఇదే అదనుగా మిల్లర్లు ధరల దందాకు తెరతీశారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను సాకుగా చూపుతూ మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి ధరలను ఇష్టానుసారంగా పెంచేస్తున్నారు. ఫలితంగా నిత్యావసరమైన బియ్యం కొనుగోలు కూడా సామాన్య కుటుంబాలకు భారంగా మారుతోంది.

టీడీపీ నేతల గుప్పెట్లో సన్నబియ్యం మార్కెట్

రాష్ట్రంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్), నాన్ కస్టమ్ మిల్లింగ్ రైస్ (ఎన్‌సీఎంఆర్) కలిపి 2 వేలకుపైగా రైస్‌మిల్లులు ఉన్నాయి. వీటిలో సన్నబియ్యం ఉత్పత్తి, మార్కెటింగ్‌లో కీలకంగా ఉన్న మిల్లుల నిర్వాహకుల్లో అత్యధికులు టీడీపీకి చెందినవారే. మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న లలిత, కళ్యాణి, లేపాక్షి, లోహిత, 777 వంటి బ్రాండ్ల వెనుక ఉన్న వ్యాపారవేత్తల రాజకీయ సంబంధాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

కళ్యాణి బ్రాండ్ బియ్యం ఉత్పత్తిదారు మండపేట టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కాగా.. లోహిత బ్రాండ్ ఉత్పత్తిదారు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వియ్యంకుడు పట్టాభి. శ్రీనివాస్ (లలిత), సూరిబాబు (లేపాక్షి), మురళీకృష్ణ ట్రేడర్స్ (777) వంటి సంస్థలు సన్నబియ్యం ఉత్పత్తి, మార్కెటింగ్‌లో కీలకంగా ఉన్నాయి.

ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని మిల్లులపై పట్టాభి, ఎమ్మెల్యే జోగేశ్వరరావుల ప్రభావం ఉందని, ఈ నెట్‌వర్క్ ద్వారా ధరల దందా సాగుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ నేతలకు సన్నిహితులైన వ్యాపారవేత్తల చేతుల్లో కీలకమైన బియ్యం మార్కెట్ ఉండటం వల్ల నియంత్రణ వ్యవస్థలు మౌనంగా ఉన్నాయని అనుకోవలసి వస్తోంది.

ప్రభుత్వ పెద్దల అండతో ధరల దందా

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సన్నబియ్యం ధరలు భారీగా పెరిగాయి. 2024 ఏప్రిల్‌లో రిటైల్ మార్కెట్‌లో కిలో సన్నబియ్యం ధర రూ.40--50 మధ్య ఉండేది. 26 కిలోల బస్తా రూ.1,100--1,200కే లభించేది. ఐదు నెలల క్రితం వరకు కిలో ధర సుమారు రూ.60 ఉండగా.. ప్రస్తుతం రూ.97కు చేరింది. 26 కిలోల బస్తా ధర రూ.2,500 దాటింది. మార్కెట్‌లోకి వస్తున్న బియ్యం గత ఖరీఫ్ సీజన్‌కు చెందినవే. గత ఏడాది రికార్డు స్థాయిలో వరి దిగుబడులు వచ్చినట్లు ప్రభుత్వమే ప్రకటించింది.

అయినప్పటికీ బియ్యం ధరలు ఇంతలా పెరగడానికి కారణమేంటి? దిగుబడులు సమృద్ధిగా ఉన్నప్పుడు కొరత ఎలా ఏర్పడింది? మిల్లర్లు నిల్వలను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదు? బియ్యం మాఫియా నుంచి మంత్రులు చినబాబు, నాదెండ్ల మనోహర్ సహా స్థానిక ప్రజాప్రతినిధులకు రోజువారీ ముడుపులు అందుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. డిమాండ్ ఉన్న ఒక్కో బ్రాండ్ మిల్లులో రూ.100 కోట్లకుపైగా దోపిడీ జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి బియ్యం బస్తాలోనూ వాటాలు పంచుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నా ప్రభుత్వం విచారణకు ముందుకు రావడం లేదు.

రేషన్ బియ్యానికే పాలిష్.. సన్నబియ్యంగా విక్రయం

బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను నియంత్రించాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. ధరల నియంత్రణ తమ చేతుల్లో లేదన్నట్టుగా వ్యవహరిస్తూ మిల్లర్ల దోపిడీకి పరోక్షంగా సహకరిస్తోంది. అదే సమయంలో ప్రజలను మభ్యపెట్టేందుకు రైతుబజార్లలో కిలో రూ.50కే సన్నబియ్యం అంటూ ప్రచారానికి తెరతీసింది. గతంలో రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసేవారు. ఇప్పుడు అదే బియ్యాన్ని పాలిష్ చేసి స్థానిక మార్కెట్‌లో సన్నబియ్యంగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఈ వ్యాపారంలో ప్రభుత్వమే కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తోందన్న విమర్శలూ ఉన్నాయి. రైతుబజార్లలో విక్రయించే బియ్యంలో 1010 వంటి దొడ్డు రకాలను సైతం కలుపుతున్నారు. కస్టమ్ మిల్లింగ్ నిబంధనల ప్రకారం బియ్యంలో 5 శాతం వరకు మాత్రమే నూకలకు అనుమతి ఉంది. కానీ రైతుబజార్లలో విక్రయించే బియ్యంలో ఏకంగా 25 శాతం వరకు నూకలు ఉంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందించాల్సిన ప్రభుత్వం ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తోంది.

నాణ్యతను పరీక్షించకుండా బియ్యాన్ని పంపిణీ చేస్తుండటంతో వండిన తర్వాత అన్నం ముక్కలైపోవడం, ముద్దగా మారిపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లేని బియ్యాన్ని సన్నబియ్యం పేరుతో అంటగట్టి ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారు.

జగన్ హయాంలో ధరలపై నిఘా.. ఇప్పుడు మాఫియాకు దన్ను

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో బియ్యం ధరలు పెరిగిన సందర్భాల్లో ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకునేది. సన్నబియ్యాన్ని తక్కువ ధరలకు మిల్లర్ల ద్వారానే విక్రయించేలా చర్యలు తీసుకునేది. ప్రతి రైస్‌మిల్లు వద్ద ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టికను ప్రదర్శించేవారు. రిటైల్ బియ్యం దుకాణాల వద్ద కూడా ధరల పట్టికలు ఏర్పాటు చేసి ధరల నియంత్రణకు చర్యలు చేపట్టేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. రిటైల్ మార్కెట్‌లో కిలో సన్నబియ్యం రూ.97కు చేరినా ప్రభుత్వ పెద్దలు స్పందించడం లేదు.

ధరల పెరుగుదల అంతర్జాతీయ సమస్య అన్నట్టుగా వ్యవహరిస్తూ చంద్రబాబు సర్కారు బాధ్యతల నుంచి తప్పించుకుంటోంది. సాధారణంగా ధరలు పెరిగినప్పుడు పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు రంగంలోకి దిగి విస్తృత తనిఖీలు నిర్వహించాలి. కృత్రిమ కొరత సృష్టించే మిల్లర్లు, వ్యాపారులపై కేసులు నమోదు చేసి అక్రమ నిల్వలను బయటపెట్టాలి.

కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఈ విభాగాలు నామమాత్రంగా మారిపోయాయి. మిల్లర్లపై తనిఖీలు లేవు.. ధరల నియంత్రణ లేదు.. నాణ్యతపై పర్యవేక్షణ అంతకంటే లేదు. రేషన్ బియ్యం రీసైక్లింగ్‌కు ఇబ్బందిగా ఉందన్న సాకుతో వైఎస్ జగన్ హయాంలో రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసిన సార్టెక్స్ బియ్యం సరఫరాకు చంద్రబాబు ప్రభుత్వం స్వస్తి పలికింది.

దీంతో రీసైక్లింగ్ మాఫియాకు మరింత అవకాశం కల్పించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు పేదల బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సన్నబియ్యంగా అమ్ముకుంటూ.. మరోవైపు అదే సన్నబియ్యాన్ని సామాన్యులకు అందనంత ఎత్తుకు ధరలను పెంచుతున్న మాఫియాకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయలేకపోతోంది. తమ జేబులు కొల్లగొడుతున్న ఈ దందాపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సామాన్యులు డిమాండ్ చేస్తున్నారు.

అన్నదాతకు ఆక్వాన్ కలవరం



అమరావతి: ఓ వైపు తీవ్రమైన కరువు.. మరోవైపు వరుస తుపానుల దెబ్బకు కకావికలమైన అన్నదాతలను ఆక్వాన్ రూపంలో దూసుకొస్తున్న మరో తుపాను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కరువు నేపథ్యంలో సాగునీటి ఎద్దడికి ఎదురొడ్డి సాగుచేసిన కొద్దిపాటి పంటలను వరుస తుపానులు నామరూపాల్లేకుండా చేస్తున్నాయి. ఖరీఫ్ పంటలనే కాదు.. రబీ పంటలపైనా తుపానులు తీవ్ర ప్రభావం చూపిస్తుండటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

కరువుకు తోడు వరుస విపత్తులు

కురిసిన భారీ వర్షాలకు పంటలు కొంతమేర దెబ్బతినగా.. పంట చేతికొచ్చే దశలో వరుసగా విరుచుకుపడిన అర్నబ్, మురసు తుపానులు అన్నదాతల ఆశలను చిదిమేశాయి. తుపానుల ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా విశాఖ, విజయనగరం జిల్లాల్లో గోస్తనీ నది ఉప్పొంగగా.. పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎర్రకాలువ, కొవ్వాడ కాలువ, గోస్తనీ కాలువలు పొంగి పొర్లడంతో లక్షలాది ఎకరాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. నేటికీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో పంటపొలాలు ముంపునీరు దిగకపోవడంతో చేతికొచ్చిన పంట పూర్తిగా నీటిలో నానుతూ కుళ్లిపోతున్నాయి.

రెండు తుపానులు.. రూ.3,208 కోట్ల ఉత్పత్తి నష్టం

ప్రాథమిక లెక్కల ప్రకారం అర్నబ్ తుపాను ప్రభావానికి 15 జిల్లాల పరిధిలో దాదాపు 6 లక్షలమంది రైతులకు చెందిన 9.38 లక్షల ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతినగా.. రూ.2,392.84 కోట్ల మేర పంటల ఉత్పత్తికి (9.78 లక్షల టన్నులు) నష్టం జరిగినట్టు అంచనా వేశారు. ఈ తుపానుకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద, ఎన్‌డీఆర్ఎఫ్ కింద రూ.815.57కోట్లు, ఎన్‌డీఆర్ఎఫ్ కింద రూ.714.96 కోట్ల మేర చెల్లించాలని అంచనా వేశారు.

మురసు తుపాను దెబ్బకు 8 జిల్లాల్లో 1.87 లక్షలమంది రైతులకు చెందిన మరో 3.57 లక్షల ఎకరాల్లో పంటలు తుడిచిపెట్టుకుపోగా.. రూ.816.53 కోట్ల (3.38 లక్షల టన్నులు) మేర ఉత్పత్తి నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. ఈ తుపానుకు దెబ్బతిన్న రైతులకు ఎన్‌డీఆర్ఎఫ్ కింద రూ.321.64 కోట్లు, ఎన్‌డీఆర్ఎఫ్ కింద రూ.266.67 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని అంచనా వేశారు. అర్నబ్ తుపానుకు సంబంధించి పంట నష్టం తుది అంచనాలు కొలిక్కి వచ్చినప్పటికీ మురసు నష్టం తుది అంచనాలు ఇంకా పూర్తి కాలేదు.

ఆక్వాన్‌తో గుండె గుభేల్

నేటికీ 53.30 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు చేలల్లోనే ఉన్నాయి. మరోవైపు ఇప్పటివరకు 6.37 లక్షల ఎకరాల్లో రబీ పంటలు సాగయ్యాయి. వీటిలో 34 లక్షల ఎకరాల్లో వరి, 11 లక్షల ఎకరాల్లో కంది, 4.8 లక్షల ఎకరాల్లో పత్తి, సాగులో ఉన్నాయి. వీటితోపాటు 16 జిల్లాల్లో 6.75 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. వీటిలో ప్రధానంగా 2.71 లక్షల ఎకరాల్లో మిరప, 2.46 లక్షల ఎకరాల్లో కొబ్బరి, 61వేల ఎకరాల్లో పసుపు, అరటి, బొప్పాయి, కూరగాయ పంటలున్నాయి.

ముఖ్యంగా తీర ప్రాంతంలోని 10 జిల్లాల్లో 23.77 లక్షల ఎకరాల్లో పంటలు సాగులో ఉండగా.. వాటిలో 23 లక్షల ఎకరాలు వరి పంట ఉంది. కోతకు సిద్ధమైన వరితో పాటు మొక్కజొన్న, పత్తి తదితర పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆక్వాన్ తుపాను రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. ఈ తుపాను ఈ పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అంచనా వేస్తున్నారు.

రెండు నెలలుగా వేటలేక మత్స్యకారుల విలవిల

రాష్ట్రంలో 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. 555 గ్రామాల్లో 8 లక్షల మంది మత్స్యకారులు సముద్రంలో చేపల వేటే జీవనాధారంగా బతుకుతున్నారు. ఇప్పటికే 30,635 బోట్లు తీరంలోనే ఉన్నాయి. కేవలం 173 మెకనైజ్డ్ బోట్లు మాత్రమే సముద్రంలో ఉన్నాయి. వీటిని కూడా తీరానికి చేర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వేటకు వెళ్లకూడదంటూ మత్స్యకారులకు వాయిస్ మెసేజిలు పంపిస్తున్నారు. వరుస తుపానుల దెబ్బకు బోట్లన్నీ తీరంలో లంగరేయడంతో మత్స్యకారులకు పూట గడవని పరిస్థితి నెలకొంది. ఆక్వాన్ తుపాను హెచ్చరికలు వారిని మరింత కలవరపాటుకు గురి చేస్తున్నాయి. దాదాపు రెండు నెలలుగా వేటకు వెళ్లక పస్తులతో వారి కుటుంబాలు అలమటిస్తున్నాయి. తుపానుల ప్రభావంతో ముంపునకు గురైన వారికి మాత్రమే అరకొరగా నిత్యావసర సరుకులు ఇస్తున్న ప్రభుత్వం తమను మాత్రం పట్టించుకోవడంలేదంటూ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

వరుస తుపానులతో రైతులు, మత్స్యకారులు కుదేలవుతున్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోంది. పొరుగు రాష్ట్రాలు కరువు ప్యాకేజీలతో పాటు పంట నష్ట పరిహారాలు అందిస్తూ రైతులకు అండగా నిలుస్తుంటే.. ఏపీలో మాత్రం ఇందుకు భిన్నంగా కరువు మండలాలను ప్రకటించడం, తుపానులు తీరం దాటగానే పంట నష్టంపై కేంద్రానికి నివేదికలు ఇవ్వడమే తప్ప సొంతంగా పైసా కూడా సాయం విదిలించన పాపానపోవడం లేదు. నవంబర్ మూడో వారం వచ్చినా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడమే ఇందుకు నిదర్శనం. అర్నబ్, మురసు తుపానులకు రంగు మారిన, ముక్కలైన ధాన్యం కొనే నాథుడు లేక రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఉబర్‌లో కొత్త సర్వీస్.. డ్రైవర్ లేకుండానే ప్రయాణం!

టెక్నాలజీ పెరుగుతోంది.. డ్రైవర్ లేకుండానే ప్రయాణించే రోజులు దగ్గరపడుతున్నాయి. ఇప్పటికే పలు దేశాల్లో.. సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల వినియోగం ఎక్కువవుతోంది. తాజాగా ఉబర్ కూడా రోబోటాక్సీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

అమెజాన్‌కు చెందిన జూక్స్ కంపెనీ తయారు చేసిన రోబోటాక్సీలు ఇప్పుడు ఉబర్ యాప్‌లో బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. నవంబర్ 16, 2026 నుంచి అమెరికాలోని లాస్‌వేగాస్‌లో ఈ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని టెక్ క్రంచ్ తన నివేదికలో వెల్లడించింది.

సాధారణంగా ఉబర్ యాప్‌లో క్యాబ్ బుక్ చేసుకున్నట్లుగానే.. రోబోటాక్సీలను కూడా బుక్ చేసుకోవచ్చు. అయితే.. వీటికి డ్రైవర్ ఉండరు. పూర్తిగా అటానమస్ టెక్నాలజీతో పనిచేస్తాయి. ఈ వాహనాలు ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరుస్తాయి.

సెల్ఫ్ డ్రైవింగ్ టెక్నాలజీ రంగంలో.. మరింత బలపడేందుకు ఉబర్ ఇప్పటికే 30కి పైగా కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగానే.. ఫుట్‌పాత్‌పై నడిచే డెలివరీ రోబోలు, సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు, రోబోటాక్సీలు, డ్రోన్లకు సంబంధించిన టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్న సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ఉత్తర అమెరికా, యూరప్, మిడిల్ ఈస్ట్ ప్రాంతాల్లో అటానమస్ వెహికిల్ టెక్నాలజీకి ప్రధాన వేదికగా ఎదగాలన్నది లక్ష్యంతో ఉబర్ అడుగులు వేస్తోంది.

ప్రస్తుతం ఈ సేవలు లాస్‌వేగాస్‌లో ప్రారంభమైనప్పటికీ.. త్వరలో మరిన్ని నగరాలకు విస్తరించే అవకాశముంది. జూక్స్ ఈ ఏడాది లాస్ ఏంజిల్స్‌లో కూడా రోబోటాక్సీ రైడ్‌లను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ప్రారంభంలో సంస్థ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, స్నేహితులకు మాత్రమే ఈ సేవలను అందించనుంది. ఆ తరువాత ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది.

అయితే.. లాస్ ఏంజిల్స్‌లో పూర్తిస్థాయి కమర్షియల్ సేవలు 2027లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. వచ్చే ఏడాది నుంచి ఉబర్ యాప్ ద్వారా కూడా అక్కడ రోబోటాక్సీలను బుక్ చేసుకునే వీలుంటుందని సమాచారం. ప్రస్తుతానికి ఉబర్ ద్వారా జూక్స్ రోబోటాక్సీ సేవలు అమెరికాలో మాత్రమే అందుబాటులో ఉన్నాయి

ఆధునిక యుద్ధంలో ఎవరూ సురక్షితం కాదు



ఢిల్లీ : కాలంతోపాటు యుద్ధరంగ స్వరూపం పూర్తిగా మారిపోతోందని.. ఆధునిక సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు సైన్యం తనను తాను మెరుగుపరుచుకుంటూనే ఉండాలని రక్షణ దళాల అధిపతి జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఉపగ్రహ ఆధారిత నిఘా, డ్రోన్లు ఆధునిక యుద్ధ స్వరూపాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ విస్తరిస్తున్న ఆధునిక యుద్ధ భూమిలో ఎవరూ సురక్షితంగా ఉండే అవకాశం లేదని హెచ్చరించారు. దేశాల ఆర్థిక పరిస్థితులు, సాంకేతిక ఆధిపత్యంలో పెరుగుతున్న పోటీ, యుద్ధ క్షేత్రాల విస్తరణ వంటివి భవిష్యత్ సంఘర్షణల స్వరూపాన్ని నిర్ధారించే కీలక అంశాలని తెలిపారు. దిల్లీలో జరిగిన ఏఎన్ఐ నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 3.0లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

'ప్రస్తుతం యుద్ధ క్షేత్రం క్రమంగా విస్తరిస్తోంది. గతంలో దేశాలను ఓడించాలంటే సైనికులను మాత్రమే లక్ష్యం చేసుకునేవాళ్లు. కానీ, ప్రస్తుతం ఆ దేశాన్ని అన్ని రకాలుగా బలహీనం చేయడానికి పరిశ్రమలు, నెట్వర్క్లు, విద్యుత్ కేంద్రాలు, పౌర నివాస ప్రాంతాలపైనా దాడులు చేస్తున్నారు. శత్రువుల దాడులను ఎదుర్కోవాలన్నా బలమైన రక్షణ వ్యవస్థలు కావాలి. అయితే, తక్కువ ధరతో తయారు చేసిన డ్రోన్ల (ణతీశీఅవం)ను ఎదుర్కోవడానికి మిలియన్ డాలర్లు విలువైన క్షిపణిని ఉపయోగిస్తే.. యుద్ధ ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలహీనమైపోతుంది. ఇటీవల అమెరికా తన పేట్రియాట్ క్షిపణులను వేగంగా ఖాళీ చేయడాన్ని మనం చూశాం. వాటిని తిరిగి సమకూర్చుకోవడానికి అగ్రరాజ్యానికి అనేక ఏళ్లు పడుతుంది. కాబట్టి అధునాతన పరికరాలతో పాటు.. చవకైన ఆయుధాలను, ఇతర పరికరాలను తయారు చేయడం కూడా ముఖ్యం"

"తమ ఆర్థిక, సైనిక బలాన్ని కాపాడుకోవాలనుకునే దేశాలకు కృత్రిమ మేధ, డేటా, కీలక ఖనిజాలపై నియంత్రణ చాలా అవసరం. వీటికోసం ప్రపంచ దేశాల మధ్య పోటీ పెరుగుతోంది. ప్రస్తుతం సాంకేతిక రంగంలో అగ్రగామిగా ఉన్న అమెరికా-చైనాల మధ్య ఈ పోటీ మరింత స్పష్టంగా కనిపిస్తోంది. అదే సమయంలో ఇతర దేశాలు కూడా ఈ అంతరాన్ని వేగంగా తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. సుదీర్ఘకాలం కొనసాగే సంఘర్షణలను ఎదుర్కొనేందుకు దేశాలు తమ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం కూడా ఉంది" అని సీడీఎస్ పేర్కొన్నారు.

రూ.కోటి ఖర్చు చేస్తేనే గెలుపు..



నెల్లూరు: కృష్ణపట్నం పోర్టు తదితరాలున్న పంచాయతీ రాజకీయంగా కాక పుట్టిస్తోంది. ముత్తుకూరు మండలంలో 20 పంచాయతీలు ఉండగా, దేనికీ ఇంతటి డిమాండ్ ఏర్పడటం లేదు. 4460 ఓట్లతో మేజర్ పంచాయతీగా ఉన్న కృష్ణపట్నంపై అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. ఫలితంగా ఇక్కడి రాజకీయ పరిణామాలు ఆసక్తిని రేపుతున్నాయి. రానున్న సర్పంచ్ ఎన్నికల్లో దీన్ని ఎలాగైనా దక్కించుకోవాలనే పట్టుదలతో ప్రధాన పార్టీల నేతలు వ్యూహాలు రచిస్తున్నారనే చర్చ సాగుతోంది. అయితే ఎవరు బరిలో దిగి గెలవాలన్నా, రూ.కోటి ఖర్చు చేయాల్సి ఉంటుందనే అంశం హాట్టాపిక్గా మారింది.

రెబల్స్ దెబ్బ : ఇటీవల నిర్వహించిన ఎంపీటీసీ ఎన్నికల్లో అధికార పార్?టలో రెబల్ అభ్యర్థి బరిలోకి దిగడం రాజకీయంగా కలకలం రేపింది. భారీగా ఓట్లు రావడంతో టీడీపీలో చీలిక ఏర్పడింది. దీంతో పార్టీ నాయకత్వానికి ఈ పరిణామం గట్టి హెచ్చరికగా మారింది. పంచాయతీ ఎన్నికల్లో ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని భావిస్తోందని సమాచారం. అయితే ఈసారి కూడా తగ్గేది లేదు.. అధికార పార్టీని గెలవనివ్వమంటూ రెబల్ వర్గాలు వ్యూహాలు రచిస్తున్నాయనే ప్రచారం స్థానికంగా మరింత వేడిని పెంచుతోంది.

గ్రూపుల పోరు : మరోవైపు రెండు, మూడు గ్రూపులుండటం టీడీపీకి మరో తలనొప్పిలా మారింది. అభ్యర్థి ఎంపిక దగ్గర్నుంచి ప్రచారం వరకు అంతర్గత విభేదాలు ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. మరోవైపు కృష్ణపట్నంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండటంతో పోరు మరింత రసవత్తరంగా మారనుంది.

డిజిటల్ పేమెంట్స్ చేసేవారికి అలర్ట్



ఢిల్లీ : దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్న వేళ ఆన్లైన్ మోసాలు, డేటా చోరీ, సైబర్ దాడుల నుంచి వినియోగదారుల సొమ్ముకు రక్షణ కల్పించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కీలక అడుగు వేసింది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను మరింత పటిష్టపరిచే లక్ష్యంతో బ్యాంకింగేతర చెల్లింపు వ్యవస్థల నిర్వహణ సంస్థలకు (నాన్ బ్యాంకు పేమెంట్ సిస్టమ్ ఆపరేటర్స్) సమగ్ర సైబర్ భద్రత, డిజిటల్ పేమెంట్ సెక్యూరిటీ నియంత్రణలపై మార్గదర్శకాలు జారీ చేసింది. వీటి ప్రకారం, ఏదైనా సైబర్ భద్రతా ఘటన లేదా సాంకేతిక అంతరాయం తలెత్తినట్లు గుర్తించిన ఆరు గంటల్లోగా ఆర్బీఐకి నివేదించడం తప్పనిసరి. సైబర్ దాడి జరిగిన తర్వాత నష్టనివారణ చర్యలు చేపట్టే పాత పద్ధతికి స్వస్తి పలికి ముందస్తు గుర్తింపు, తక్షణ స్పందన, నిరంతర పర్యవేక్షణ విధానాలను అమలు చేయడమే ఈ కొత్త నిబంధనల ప్రధాన ఉద్దేశం. ముఖ్యంగా యూపీఐ, కార్డులు, డిజిటల్ వాలెట్ల లావాదేవీలకు వెన్నెముకగా నిలిచే సంస్థల భద్రతా ప్రమాణాలను ఆర్బీఐ మరింత కట్టుదిట్టం చేసింది.

చంద్రబాబు అరాచకాలు ఎక్కువ కాలం సాగవు

గుంటూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను? ఎదుర్కోవడం చంద్రబాబుకు చేతకాదు అంటూ ఆయనపై వైఎస్సార్సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. చంద్రబాబు అరాచకాలు ఎక్కువ కాలం సాగవని హెచ్చరించారు. అలాగే, పోలీసులను అడ్డం పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో కూటమి గెలిచిందని చెప్పుకొచ్చారు. అలాగే, ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఓడిపోయింది.. పోలీసులు టీడీపీ కార్యకర్తల మాదిరిగా పనిచేస్తున్నారని ఆరోపించారు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.

వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించడానికి వైఎస్సార్సీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తలశిల రఘురాం, మేరుగు నాగార్జున, అంబటి రాంబాబు, నూరి ఫాతిమా, డైమండ్ బాబు, పలువురు నేతలు గుంటూరు జిల్లా జైలుకు వెళ్లారు. ములాఖత్ ద్వారా లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించారు. అనంతరం, సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ..'పోలీసులు, కూటమి నేతలు చట్టాన్ని దుర్వినియోగం చేశారు. అబద్దాలు చెప్పి ఎన్నికల్లో కూటమి గెలిచింది. అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా?. బ్యాలెట్ బాక్స్ను అక్రమంగా తీసుకెళ్లే వారిని అరెస్ట్ చేయకుండా అక్రమాలను అడ్డుకున్న అప్పిరెడ్డిని అరెస్టు చేశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో కూటమి గెలిచింది. పోలీసులు, కూటమి నేతలు చట్టాన్ని దుర్వినియోగం చేశారు. పోలింగ్ బూత్



దగ్గరే కూటమి నేతలు డ్రామాలు మొదలు పెట్టారు. పంచాయతీ ఎన్నికల్లో కూడా కూటమి నేతలు అరాచకాలు చేస్తున్నారు. పోలీసుల బెదిరింపులకు వైఎస్సార్సీపీ శ్రేణులు భయపడరు. భవిష్యత్లో కూటమి నేతలు చట్టపరంగా శిక్ష ఎదుర్కొక తప్పదు. వైఎస్సార్సీపీ నేతలపై తప్పుడు కేసులు బనాయించిన పోలీసులపై న్యాయ పోరాటం చేస్తాం. రానున్న రోజుల్లో కూటమి నేతలకు చట్టపరంగా శిక్ష తప్పదు. గతంలో ఈవీఎంలు, ఇప్పుడు బ్యాలెట్ బాక్స్లతో కూటమి అక్రమాలు చేస్తోంది. పులివెందులలో రెండువేల మందికిపైగా అక్రమ కేసులు బనాయించారు. వైఎస్ జగన్ బయటకు వస్తే చంద్రబాబుకు వణుకు' అని అన్నారు.

నింధితులను అరెస్టుచేయాలి : హతుడి భార్య ధర్నా



విజయనగరం : సంచలనం సృష్టించిన ఆదివాసీ ఉపాధ్యాయుడు మృతికి కారణమైన నింధితులు అందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ హతుడు కుటుంబ సభ్యులు ఆందోళన బాట పట్టారు. దీపావళి రోజు ఈ ఘటన జరిగితే ఇప్పటి వరకూ పోలీసుల నుంచి తగిన రీతిలో స్పందన లేకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ కార్యాలయాలు చుట్టూ తిరిగిన ఆ కుటుంబ సభ్యులు నేడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాని చేపట్టారు. హతుడు కుటుంబీకులకు చేపట్టిన ఈ ఆందోళనకి దళిత, ఆదివాసీ సంఘాలు మద్దతు పలికాయి. ఆ ఆందోళనలో భాగస్వాములయ్యాయి. తహశీల్దార్ కి వినత పత్రాన్ని అందజేశాయి. బాధితులకి తగిన న్యాయం చేయాలని కోరాయి. అనంతరం మీడియాతో హతుడు భార్య రమణమ్మ మాట్లాడుతూ దీపావళి రోజు తన భర్త రాత్రి ఎనిమిది గంటల సమయంలో వాకింగ్ నిమిత్తం ఇంటి నుంచి బయటకి వెళ్లారని అన్నారు. ఆయన వెంటనే తన ఇంటికి ఎదురుగా ఉన్న ఉరిటి రామ చంద్రరావు కుక్కను తీసుకుని వెళ్లారని అన్నారు. తన భర్తతో గొడవ పడి, మాజీ డైరక్టర్ జానా ప్రసాద్ ప్రోద్బలంతో రామచంద్రరావు, అతని ఇద్దరి కుమారులు తన భర్త మీద దాడి చేశారని ఆమె ఆరోపించారు. ఆ దాడితో తీవ్రంగా గాయపడిన తనభర్త ఇంటి ముందుకు వచ్చి కుప్పకూలిపోయారని వివరించారు. తాము పోలీస్ స్టేషన్ కి వెళ్లి కేసు పెట్టామని అన్నారు. డిఎస్పీ విచారణ కూడా జరిగిందన్నారు. తమ నుంచి సిసి టివి పుటేజీను కూడా పోలీసులు తీసుకుని వెళ్లారని అన్నారు. కాని, నేటి వరకూ నింధితులను మాత్రం అరెస్టు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రామచంద్రరావు అనే వ్యక్తిని మాత్రమే అరెస్టు చేశారని అన్నారు. మిగిలిన వాళ్ల విషయంలో పోలీసులు తాత్సారం చేస్తూనే ఉన్నారన్నారు. ఇప్పటికే డిఎస్పీ కార్యాలయానికి, నెల్లిమర్ల పోలీస్ స్టేషన్ కి అనేక సార్లు వెళ్లానని అన్నారు. కాని, నేటికీ న్యాయం జరగలేదన్నారు. అందువలనే తాము ఆందోళనకి దిగామన్నారు. అమెకు మద్దతు పలికిన జై భీమ్ రావ్ భారత పార్టీ జిల్లా అధ్యక్షులు టొంపల నర్సయ్య, డిబిఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంపీ రాజు మాట్లాడుతూ ఘటన జరిగిన దాదాపుగా వారం రోజులు కావస్తున్నా నింధితులను అరెస్టు చేయడంలో పోలీసులు నాన్చుడు ధోరణిని అవలంభించడం పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వెంటనే నింధితులు అందరినీ అరెస్టు చేయాలన్నారు. ఆదివాసీ ఉపాధ్యాయుడిని రాత్రి ఎనిమిది గంటలకు ఈ ఘాతుకానికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షపడేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే జిల్లా వ్యాపితంగా ఆందోళనను ఉధృతంచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకుడ నరిసింహ దొర, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బంగారాజు, ఎస్టీ సంఘం నెల్లిమర్ల మండల అధ్యక్షులు దీసారి మురళీ, మహిళా సంఘ నాయకురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

బకాయిలు ఉంటే పోటీకి అనర్హులు

అమరావతి: గ్రామ పంచాయతీకి ఇంటి పన్ను తదితర బకాయిలు ఉన్న వారు సర్పంచి/వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు అనర్హులని రాష్ట్ర ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఈ మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికల నియమావళిలోనే రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. అయితే నామినేషన్ దాఖలు సమయంలో అభ్యర్థులు నో--డ్యూస్ సర్టిఫికెట్ అందజేయాల్సిన అవసరం లేదని గతంలో ప్రకటించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ తాజాగా, బకాయిలు ఉంటే నామినేషన్ల పరిశీలన సమయంలో ప్రత్యర్థి ఫిర్యాదు చేయడానికి, నిబంధనల ప్రకారం అలాంటి వారు పోటీకి అనర్హులుగా అధికారులు పేర్కొనడానికి అవకాశం ఉంటుందని వెల్లడించడం గమనార్హం.

మరోవైపు అభ్యర్థి నామినేషన్ దాఖలు సమయంలో అందజేసే స్వీయ డిక్లరేషన్ ఫార్మెట్లో బకాయిల అంశం కూడా ఉండడం విశేషం. ఒకరు ఒకటి కంటే ఎక్కువ వార్డుల్లో పోటీ చేయడానికి వీలుండదని ఎన్నికల నిబంధనావళిలో పేర్కొన్నారు. అయితే, ఒకటి కంటే ఎక్కువ వార్డులకు ఎవరైనా నామినేషన్ దాఖలు చేసినా, ఏదో ఒక చోట నుంచే పోటీ చేయాలని స్పష్టం చేసింది. అయితే, ఎక్కువ చోట్ల నామినేషన్లు వేసి ఎక్కడా ఉపసంహరించుకోకుంటే అన్ని నామినేషన్లు చెల్లుబాటు కాకుండా పోతాయని పేర్కొంది.

అందజేయాల్సిన ధ్రువీకరణ పత్రాలు

- ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులు తమ రిజర్వేషన్కు సంబంధించి తహసీల్దార్ హోదా కన్నా తక్కువ కాని అధికారి సమక్షంలో డిక్లరేషన్ పత్రం.
- అభ్యర్థి గత నేరచరిత్ర, ఆస్తులు, అప్పులు, విద్యార్హతలకు స్వీయ డిక్లరేషన్ను నిర్ణీత ఫార్మెట్లో సమర్పించాలి.



- ఎన్నికల వ్యయంపై డిక్లరేషన్ ఫారం.
- ఎన్నికల డిపాజిట్ రశీదు.

నేటి నుంచి గ్రామ పంచాయతీల్లో నామినేషన్లు

తొలి విడతలో ఎన్నికలు జరుగుతున్న 3,967 గ్రామ పంచాయతీల్లో 3,967 సర్పంచి పదవులతో పాటు ఆయా పంచాయతీల్లోని మొత్తం 40,012 వార్డు సభ్యుల పదవులకు ఆదివారం ఉదయం పదిన్నర గంటల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. చిన్న గ్రామ పంచాయతీలలో 2--4 పంచాయతీలను ఒక క్లస్టరుగా ఏర్పాటు చేసి అందులో పెద్ద పంచాయతీల్లో నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. 2011 గణాంకాల ప్రకారం పది వేలకు పైబడి జనాభా ఉండే గ్రామాల్లో ఎక్కడికక్కడే నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణకు ముందే పంచాయతీల కార్యాలయ నోటీసు బోర్డులో ఎన్నికల నోటిఫికేషన్ కాపీ, ఓటర్ల జాబితాలను ఉంచాలని ఎస్ఈసీ ఆదేశాలిచ్చింది.

పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తారా?



ఢిల్లీ : దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు కోసం ఆశగా ఎదురుచూస్తున్న సామాన్య వాహనదారులకు ఇప్పట్లో తక్షణ ఊరట లభించే సూచనలు కనిపించడం లేదు. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి, ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థల ఆర్థిక నష్టాలు ఇంధన ధరల కోతకు ప్రధాన అడ్డంకులుగా మారాయి. చమురు కంపెనీలు సుమారు రూ.42,000 కోట్ల మేర నష్టాలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇప్పుడే ధరలను తగ్గించడం సాధ్యం కాదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

చమురు సంస్థలపై భారం : భారత్ తన ముడిచమురు అవసరాల్లో దాదాపు 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం అంతర్జాతీయ చమురు సరఫరా గొలుసును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. రవాణా మార్గాల్లో అంతరాయాల వల్ల ముడిచమురు సేకరణ, నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరిగాయి. దిగుమతి వ్యయాలు పెరిగినప్పటికీ దేశీయ వినియోగదారులపై భారం పడకుండా రిటైల్ ధరలను స్థిరంగా ఉంచడం వల్ల ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వంటి కంపెనీలు ఆర్థికంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అయితే, మంత్రి ప్రస్తావించిన రూ.42,000 కోట్ల నష్టాల గణాంకాలు ఏ ఆర్థిక కాలానికి సంబంధించినవి, వాటి లెక్కింపు ప్రాతిపదిక ఏమిటన్న దానిపై ఆయా సంస్థల అధికారిక త్రైమాసిక ఆర్థిక నివేదికల ద్వారా మరింత స్పష్టత రావాల్సి ఉంది.

గతంలో తీసుకున్న చర్యలు : దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు మార్కెట్ ఆధారితంగా నిర్ణయమవుతాయని గతంలో లోక్సభలో మంత్రి సురేశ్ గోపీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గిన వెంటనే దేశీయంగా ధరలు తగ్గించడం సాధ్యం కాదని, చమురు సంస్థల గత నష్టాలు (అండర్ రికవరీలు), సరఫరా పరిస్థితులు, పన్నుల నిర్మాణాన్ని బట్టి ఆయా సంస్థలే ధరలపై నిర్ణయం తీసుకుంటాయని కేంద్రం వెల్లడించింది. కాగా, 2026 మార్చి 27న అంతర్జాతీయ ధరలు పెరిగినప్పుడు కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.10 చొప్పున తగ్గించింది. అయితే, ఆ ప్రయోజనాన్ని నేరుగా రిటైల్ ధరల్లో తగ్గించకుండా చమురు సంస్థలు భరిస్తున్న నష్టాలను పూడ్చుకునేందుకు వినియోగించింది. ధరల భారం తగ్గాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు తాము విధించే విలువ ఆధారిత పన్నును (వ్యాట్) తగ్గించాలని కేంద్రం సూచిస్తోంది. రాష్ట్రాలు వ్యాట్ తగ్గిస్తే వినియోగదారులకు కొంత ఉపశమనం దక్కే అవకాశం ఉంది. కానీ, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ కోసం ఇంధన పన్నుల ఆదాయంపైనే అధికంగా ఆధారపడే రాష్ట్రాలు ఈ ఆదాయాన్ని వదులుకోవడానికి ఎంతవరకు ముందుకు వస్తాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. మొత్తంగా పరిశీలిస్తే, కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరల తగ్గింపుపై ఎలాంటి నిర్దిష్ట గడువును ప్రకటించలేదు. పశ్చిమాసియాలో పరిస్థితులు చక్కబడి, అంతర్జాతీయ ముడిచమురు ధరలు స్థిరపడటంతో పాటు దేశీయ చమురు సంస్థలు తమ ఆర్థిక నష్టాల నుంచి కోలుకుంటేనే రిటైల్ ధరల కోతకు మార్గం సుగమం అవుతుంది. అప్పటివరకు వాహన దారులు ప్రస్తుత ధరలతోనే సర్దుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

'మురసు' నష్టం రూ.2,484.43 కోట్లు

అమరావతి: ఒకేసారి రెండు తుపాన్లు రావడంతో రాష్ట్రానికి భారీ నష్టం కలిగిందని, మురసు తుపాను వల్ల దాదాపు రూ.2,484.43 కోట్ల నష్టం వాటిల్లిందని సీఎం చంద్రబాబు కేంద్ర బృందానికి తెలిపారు. తుపాను నష్టాల్ని అంచనా వేయడానికి రాష్ట్రానికి వచ్చిన కేంద్ర హోమ్ శాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల కేంద్ర బృందం ఆదివారం పర్చువల్గా సీఎంతో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. తుపాను నష్టాన్ని తగ్గించేలా శాశ్వత పరిష్కారంగా మౌలిక వసతులు మరింత దృఢంగా నిర్మించాల్సి ఉందని, దీనికి కేంద్ర సాయం కావాలని, ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని 10 రోజుల్లో తుపాను నష్టంపై కేంద్రానికి నివేదిక సమర్పించాలని బృందాన్ని కోరారు. పంట నష్టపోయిన రైతులకు బీమా సాయం త్వరగా అందేలా పనిచేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. రహదారులకు భారీ నష్టం జరిగిందని, ముఖ్యంగా ఫ్లాష్ ఫ్లడ్లతో గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడాన్ని గమనించామని కేంద్ర బృందం తెలిపింది. పత్తి వంటి వాణిజ్య పంటలకు బీమా ప్రీమియం అధికంగా ఉండటంతో ఎక్కువ మంది రైతులు బీమా చేసుకోలేదని పేర్కొంది. గిరిజనులపైనా తుపాను తీవ్ర ప్రభావం చూపిందని, వారిని ప్రత్యేకంగా ఆదుకోవాల్సి ఉందని తెలిపింది. వరి పంటకు తూర్పు గోదావరి జిల్లాలో 80 శాతం, ఏలూరు జిల్లాలో 90 శాతం వరకు నష్టం వాటిల్లిందని, హార్టికల్చర్ పంటల్లో మామిడి, బొప్పాయి పంటలు ఎక్కువ దెబ్బతిన్నాయని కేంద్ర బృందం వివరించింది. కాగా.. మురసు వల్ల దాదాపు రూ.2,484.43 కోట్ల నష్టం వాటిల్లినట్లు కేంద్ర బృందానికి రాష్ట్ర ప్రభుత్వ అంచనాలతో నివేదిక సమర్పించింది.

ఇక్కడా ఏకగ్రీవాలే లక్ష్యమా?

అమరావతి: రాష్ట్రంలో 20 శాతం పంచాయతీలు ఏకగ్రీవం కావాలని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఆకాంక్షించడం రాజకీయ, ప్రజాస్వామిక వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థకు నేతృత్వం వహిస్తున్న సీనియర్ అధికారి ఏకగ్రీవాలపై ప్రత్యేకంగా ఆశాభావం వ్యక్తం చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఎన్నికల కమిషనర్ బాధ్యత ఏకగ్రీవాలను ప్రోత్సహించడమా? లేక ప్రజలకు పోటీ చేసే, తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకునే అవకాశం కల్పించడమా? అని ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలే ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే ప్రధాన వేదిక. గ్రామ స్థాయిలో సైతం ప్రజలు తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే స్వేచ్ఛ కలిగి ఉండాలి.

పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం తప్ప కాకపోయినా, ఏకగ్రీవాల శాతాన్ని ముందుగానే లక్ష్యంగా నిర్దేశించుకోవడం ఎంత వరకు సమంజసమనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గ్రామాల్లో అభ్యర్థుల మధ్య పోటీ ఉండటం ప్రజాస్వామ్యానికి సహజ లక్షణం. అలాంటప్పుడు 20 శాతం పంచాయతీలు ఏకగ్రీవం కావాలని ఆశించడం వెనుక అంతర్యమేమిటన్న చర్చ సాగుతోంది.

ముఖ్యంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఏకగ్రీవాల కోసం రాజకీయ ఒత్తిళ్లు, ప్రలోభాలు, బెదిరింపులు చోటుచేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉంటుంది. ఏకగ్రీవాలు నిజంగా గ్రామస్తుల ఏకాభిప్రాయంతోనే జరుగుతున్నాయా? లేక రాజకీయ ప్రాబల్యం, అధికార ఒత్తిళ్ల ప్రభావంతో జరుగుతున్నాయా?

ఈ నేపథ్యంలో పోటీ చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ సమాన అవకాశం కల్పించడం, ఓటర్లకు స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం కల్పించడం ఎన్నికల కమిషన్ ప్రాథమిక బాధ్యత. ఆ బాధ్యతను పక్కనపెట్టి ఏకగ్రీవాల శాతంపై ఆకాంక్షలు వ్యక్తం చేస్తే ఎన్నికల నిష్పాక్షికతపై సందేహాలు కలగడం సహజం. ఎన్నికలు నిర్వహించేది ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవడానికా? లేక పోటీ లేకుండానే ఫలితాలు రావాలనుకోవడానికా? ఎస్ఈసీ తీరు చూస్తుంటే అధికార టీడీపీ శ్రేణులు బరితెగించి అడ్డగోలుగా ఏకగ్రీవాలు చేసుకోండని ఉప్పందించడమేననే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జవాన్లపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులు హతం

జమ్మూకశ్మీర్: జమ్మూకశ్మీర్లోని కుల్గామ్ జిల్లాలో సోమవారం భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో లతీఫ్ భట్ అనే లష్కరే ఉగ్రవాదితో పాటు అతడి అనుచరుడు ఉన్నట్లు అధికారులు తెలిపారు. గత వారం మిర్ బజార్లోని సీఆర్పీఎఫ్ క్యాంపుపై జరిగిన దాడితో వీరికి సంబంధం ఉన్నట్లు సమాచారం. కాగా నవంబర్ 11న జరిగిన ఈ దాడిలో ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. దాడి అనంతరం ఉగ్రవాదులు అటవీ ప్రాంతంలోకి పారిపోయారు. అయితే అంతకుముందు అనంత్నాగ్, కుల్గామ్ ప్రాంతాల్లో జరిగిన పలు ఉగ్రదాడుల్లోనూ లతీఫ్ భట్ ప్రమేయం ఉన్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. మరోవైపు కిష్త్వార్ జిల్లాలో ఇద్దరు స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు బాబీ చంద్, యశ్పాల్ కుమార్లను ఉగ్రవాదులు హతమార్చారు. వరుస దాడుల నేపథ్యంలో జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు సీఆర్పీఎఫ్ స్పెషల్ డీజీ సందీప్ ఖిర్వార్ తెలిపారు.


బద్రీనాథ్పై మంచు దుప్పటి..



బద్రీనాథ్: బద్రీనాథ్ ఆలయ ద్వారాలు మూతపడటానికి ముందే ధామ్లో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. ఉత్తరాఖండ్లోని చమోలీ జిల్లాలో ఉన్న బద్రీనాథ్తో

ఐఫోన్ మోజు.. కుటుంబాలకు ఉరితాడు!

- ఆపిల్ లోగో కోసం ప్రాణాల పందెం!
- యువతలో బ్రాండ్ బానిసత్వం.. అప్పుల ఊబిలో సామాన్య కుటుంబాలు
- బ్రాండ్ బానిసలుగా యువతరం.. బలవుతున్న కుటుంబాలు!
- హోదా కోసం హత్యలు.. ఫోన్ కోసం ఆత్మహత్యలు!
- అప్పుల ఊబిలో యువతరం.. ఆర్థిక భారంతో కుంగుతున్న తల్లిదండ్రులు
- సోషల్ మీడియా మాయలో సామాజిక విలువలకు తూట్లు..
- డిజిటల్ ఇండియా అంటారు.. అప్పుల ఊబిలో యువత మునుగుతోంది!
- ప్రభుత్వాల ప్రచార ఆర్భాటం తప్ప యువతకు దిశానిర్దేశం ఏదీ?



అమరావతి : ఒకప్పుడు ఫోన్ అంటే అవసరం.. ఇప్పుడు అదే ఫోన్ హోదాకు చిహ్నంగా మారింది. ఒకప్పుడు మనిషి విలువ అతడి వ్యక్తిత్వంతో కొలిచేవారు.. ఇప్పుడు చేతిలో ఉన్న ఫోన్ బ్రాండ్‌తో అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఐఫోన్ ఉంటేనే సమాజంలో గౌరవం, స్నేహితుల్లో ప్రత్యేక గుర్తింపు, సోషల్ మీడియాలో అధిక ఆదరణ లభిస్తుందనే భ్రమ యువతరాన్ని వెంటాడుతోంది. ఈ మోజు చివరకు కుటుంబ బంధాలను తెంచుతోంది. అప్పుల ఊబిలోకి నెడుతోంది. హత్యలు, ఆత్మహత్యలకు దారితీస్తోంది. మహారాష్ట్ర నుంచి ఉత్తరప్రదేశ్ వరకు వెలుగుచూస్తున్న ఘటనలు దేశంలోని మారుతున్న సామాజిక పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.

కొండపై విషాదం.. ఐఫోన్ కోసం ముగ్గురి ప్రాణాలు!

మహారాష్ట్రలో చోటుచేసుకున్న విషాద ఘటన సమాజాన్ని కలచివేసింది. ఐఫోన్ కొనివ్వలేదన్న మనస్తాపంతో 19 ఏళ్ల యువకుడు కొండపై నుంచి దూకేందుకు సిద్ధపడగా, అతడిని కాపాడేందుకు వెళ్లిన తండ్రి, అక్కడి దృశ్యాన్ని చూసి ఆందోళనకు గురైన తల్లి కూడా ప్రమాదంలో చిక్కుకున్నారు. చివరకు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురూ కొండపై నుంచి పడి ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వెలువడ్డాయి. ఒక ఖరీదైన ఫోన్ కోసం మొదలైన వివాదం కుటుంబాన్నే బలిగొన్న విషాదంగా మారింది.

ఐఫోన్ ఆర్డర్.. డెలివరీ ఏజెంట్ హత్య!

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో చోటుచేసుకున్న మరో ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. క్యాష్ ఆన్ డెలివరీ పద్ధతిలో ఐఫోన్ ఆర్డర్ చేసిన వ్యక్తులు చివరకు డబ్బులు చెల్లించకుండా ఉండేందుకు డెలివరీ ఏజెంట్‌ను హత్య చేసి, మృతదేహాన్ని గోనెసంచిలో కట్టి కాలువలో పడేసిన ఘటన కలకలం రేపింది. విలాస వస్తువు కోసం మరో మనిషి ప్రాణం తీయడానికి కూడా వెనుకాడని క్రూరత్వం సమాజం ఎటువైపు వెళ్తోందన్న ప్రశ్నను లేవనెత్తుతోంది.

ఆపిల్ లోగో ఉంటేనే హోదానా?

పదివేల రూపాయల స్మార్ట్‌ఫోన్‌తో పూర్తయ్యే పనులే లక్షన్నర రూపాయల ఐఫోన్‌తోనూ జరుగుతున్నాయి. అయినా యువతలో కొందరికి ఐఫోన్ ఒక అవసరం కాదు.. ప్రతిష్ఠకు ప్రతీకగా మారింది. స్నేహితుల వద్ద ఫోన్ లేకపోతే అవమానంగా భావించడం, ఇతరుల ఫోన్లతో పోల్చుకోవడం, సోషల్ మీడియాలో ఖరీదైన ఫోన్‌తో ఫోటోలు పెట్టి గుర్తింపు పొందాలనుకోవడం పెరుగుతోంది.

ఇది కేవలం వినియోగదారుల అభిరుచి కాదు.. మానసిక ఒత్తిడికి, సామాజిక పోలికలకు సంబంధించిన సమస్యగా మారుతోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా తమకు ఖరీదైన ఫోన్ కావాల్సిందేనని పట్టుబడుతున్న యువతలో కొందరు కన్నవారి కష్టాన్ని కూడా పట్టించుకోవడం లేదు.

ఈఎంఐల వల.. యువత అప్పుల ఊబి!

ఫిన్‌టెక్ యాప్‌లు, బై నౌ పే లేటర్, నో కాస్ట్ ఈఎంఐ, క్రెడిట్ కార్డుల ఆఫర్లు యువతను సులభంగా ఆకర్షిస్తున్నాయి. చేతిలో డబ్బు లేకపోయినా ఫోన్ కొనుగోలు చేసే అవకాశం ఉండటంతో ఆదాయానికి మించి ఖర్చు చేస్తున్నారు. నెలకు పదివేల రూపాయల ఆదాయం లేని యువత కూడా వాయిదాల పేరుతో లక్షల విలువైన ఫోన్లను కొనుగోలు చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఆ తర్వాత క్రెడిట్ కార్డు బిల్లులు, వడ్డీలు, ఫైనాన్స్ సంస్థల రికవరీ ఒత్తిళ్లు మొదలవుతున్నాయి. అప్పులు తీర్చలేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. పిల్లల కోరికలు తీర్చేందుకు తల్లిదండ్రులు తమ అవసరాలను పక్కనపెట్టి అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే చిన్న కోరికే పెద్ద భారంగా మారుతుందని ఈ పరిణామాలు హెచ్చరిస్తున్నాయి.

ప్రచారాలే తప్ప.. యువతకు దిశానిర్దేశం ఎక్కడ?

యువతే దేశ భవిష్యత్తు అంటూ పాలకులు వేదికలపై ఉపన్యాసాలు ఇస్తున్నారు. డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, నైపుణ్యాభివృద్ధి అంటూ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ అదే యువతలో పెరుగుతున్న వినియోగవాదం, ఆన్‌లైన్ అప్పుల ఉచ్చు, సోషల్ మీడియా ఒత్తిడి, మానసిక సమస్యలపై ఎంతమేరకు అవగాహన కల్పిస్తున్నారు? పాఠశాలలు, కళాశాలల్లో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ బాధ్యత, మానసిక ఆరోగ్యం వంటి అంశాలకు తగిన ప్రాధాన్యం ఉందా? అన్నది పాలకులు, విద్యావేత్తలు, సామాజిక సంస్థలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

యువతను కేవలం మార్కెట్ వినియోగదారులుగా చూసే వ్యాపార ధోరణికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. బాధ్యతాయుతమైన రుణాల మంజూరు, డిజిటల్ ఫైనాన్స్‌పై అవగాహన, సైబర్ భద్రత, మానసిక ఆరోగ్యంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కోరికలకు అంగీకరించడమే ప్రేమ కాదని, ఆర్థిక స్థోమత, అవసరాల మధ్య తేడాను నేర్పించాలి.

ఫోన్ మనిషి కోసం.. మనిషి ఫోన్ కోసం కాదు!

స్మార్ట్‌ఫోన్ అనేది సమాచార మార్పిడికి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే సాధనం మాత్రమే. అది మనిషి స్థాయిని, వ్యక్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని నిర్ణయించదు. ఖరీదైన ఫోన్ చేతిలో ఉన్నంత మాత్రాన జీవితంలో విజయం సాధించినట్లు కాదు. కన్నవారి కష్టాన్ని అర్థం చేసుకోవడం, ఆర్థిక బాధ్యతతో వ్యవహరించడం, ఇతరుల ప్రాణాలకు విలువ ఇవ్వడం నిజమైన సంస్కారం.

ఐఫోన్ మోజులో ప్రాణాలు పోతుంటే.. సమాజం ఇంకా మౌనంగా ఉండాలా? పాలకులు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సామాజిక సంస్థలు ఇప్పటికైనా మేల్కోవాలి. లేదంటే స్టేటస్ కోసం మొదలైన ఈ పరుగు.. ఎన్నో కుటుంబాలకు శాశ్వత విషాదాన్ని మిగిల్చే ప్రమాదం ఉంది.ఐఫోన్ చేతిలో ఉండటం గొప్ప కాదు.. కుటుంబం సంతోషంగా ఉండటమే అసలైన గొప్పతనం!

తిరువూరు అటవీ ప్రాంతాల్లోకి పెద్దపులి



తిరువూరు: మహారాష్ట్ర నుంచి పాపికొండల అటవీ ప్రాంతాల వరకు ప్రయాణించిన పెద్దపులి ప్రస్తుతం తిరువూరు మండల అటవీ ప్రాంతాలకు చేరుకుంది. ఎ. కొండూరు మండలం పుడమిగట్టు ప్రాంతం నుంచి సుమారు 30 కిలో మీటర్ల మేర ప్రయాణించింది. శనివారం తెల్లవారుజామున తిరువూరు మండల పరిధిలోని జి. కొత్తూరు- చిక్కుళ్లగూడెం అటవీ ప్రాంతానికి చేరినట్లు అధికారులు గుర్తించారు. దీంతో అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. రైతులు ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లకూడదని సూచిస్తున్నారు. పులి కదలికలపై అటవీ శాఖ అధికారులు అందించే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

సవాళ్లకే సవాలు విసిరే వ్యక్తిని నేను: ప్రధాని మోదీ



ఢిల్లీ : తాను సవాళ్లకే సవాలు విసిరే వ్యక్తినని, అలా చేయడాన్ని ఎప్పుడూ ఆపలేదని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ తొలి ఐఐటీ.. పశ్చిమ బెంగాల్ లోని 'ఐఐటీ-ఖరగ్‌పుర్' ప్లాటినం జూబ్లీ వేడుకలకు మోదీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. "ఒకప్పుడు స్వాతంత్ర్య సమరయోధుల కోసం నిర్బంధ శిబిరం ఉన్న ప్రాంతంలోనే ఐఐటీ ఖరగ్‌పుర్‌ను నిర్మించారు. 75 ఏళ్ల ప్రయాణంలో ఈ ఐఐటీ ఎన్నో మైలురాళ్లను చేరుకుంది. దేశాభివృద్ధిలో, అవిష్కృ రణ రంగంలో కీలక పాత్ర పోషిస్తోంది" అని ప్రధాని తెలిపారు.

"గత 12 ఏళ్లలో ఎన్నో అవకాశాలకు ద్వారాలు తెరిచాం. పేద ప్రజలను శక్తిమంతం చేశాం. పేదరిక నిర్మూలన అంశం గతంలో ఎర్రకోట వేదికగా ప్రసంగాలు, దస్త్రాల రూపకల్పనకే పరిమితమైంది. కానీ, గత 12-13 ఏళ్లలో 50 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని ఇటీవల ప్రపంచ బ్యాంక్ నివేదిక తెలిపింది. మా ప్రభుత్వ ప్రయత్నాల వల్లే ఇది సాధ్యమైంది. నేను సెమీకండక్టర్ మిషన్ గురించి మాట్లాడి నప్పుడు.. చాలామంది ఆలస్యమైందన్నారు. కానీ.. ఇప్పుడు ఈ రంగంలో మనం ముందున్నాం. రాబోయే రెండు దశాబ్దాలు విద్యార్థులతో పాటు దేశానికీ ఎంతో కీలకం" అని మోదీ పేర్కొన్నారు.

75 మంది విద్యార్థులతో ముచ్చట.. 1951లో స్థాపించిన ఐఐటీ ఖరగ్‌పుర్‌కు ప్రధాని మోదీ రావడం ఇదే తొలిసారి. 75 ఏళ్ల వేడుక సందర్భంగా స్మారక వెండి నాణేన్ని ఆయన ఆవిష్కరించారు. అంతకుముందు '75 వాయిసెస్ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమం కింద 75 మంది విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఐఐటీ విద్యార్థుల ఆవిష్కరణలు, స్టార్టప్ అంశాలు, పరిశోధనా నమూనాలను పరిశీలించారు. ఇందులో వ్యవసాయం, వస్త్ర పరిశ్రమ, రోబోటిక్స్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, డ్రోన్ సాంకేతికత, వైద్య రంగానికి సంబంధించినవి ఉన్నాయి.

శబరిమలలో ఈ నెలాఖరు వరకు.. నిత్యం 5వేల అదనపు క్యూ స్లాట్లు



తిరువనంతపురం: శబరిమలలో ప్రస్తుతం కొనసాగుతున్న యాత్రా సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని యాత్రికుల కోసం రోజువారీ వర్చువల్ క్యూ సదుపాయాన్ని విస్తరించాలని, నవంబరు 30 వరకు నిత్యం అదనంగా 5,000 క్యూ స్లాట్లను చేర్చాలని దేవస్థానం బోర్డు శుక్రవారం నిర్ణయించింది. అలాగే 21, 22 తేదీల్లో స్పాట్ బుకింగు సామర్థ్యాన్ని కూడా తదనుగుణంగా పెంచనున్నట్లు బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. వర్చువల్ క్యూ విధానం ద్వారా దర్శనానికి బుకింగు చేసుకోలేకపోయిన భక్తులకు ఈ నిర్ణయం ఉపశమనం కలిగిస్తుందని భావిస్తున్నట్లు పేర్కొంది.

యాత్రికుల సౌకర్యార్థం ఆలయ పరిసరాలతోపాటు ఇతర మార్గాల్లోనూ వివిధ భాషల్లో మరిన్ని సూచిక బోర్డులు, డిజిటల్ తెరలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. దుకాణాల వద్ద వినియోగదారులకు కనిపించేలా నాలుగు భాషల్లో ధరల పట్టికలు ఉండాలని యజమానులకు సూచించారు. కౌంటర్ల వద్ద, అన్నదాన మండప మార్గంలో ప్లాస్టిక్ చెత్త తొలగింపునకు చర్యలు తీసుకోనున్నారు. పారిశుధ్య చర్యల నిమిత్తం అదనపు సిబ్బంది నియామకాలు చేపడతారు.

విమానాశ్రయాల నుంచి పంబకు నేరుగా ఏసీ బస్సులు

శబరిమల యాత్రికుల కోసం తిరువనంతపురం, కొచిన్ విమానాశ్రయాల నుంచి నేరుగా పంబకు ఏసీ బస్సు సదుపాయం కల్పిస్తున్నట్లు కేరళం రవాణాశాఖ మంత్రి సి.పి.జాన్ తెలిపారు. తిరువనంతపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి పంబకు కేరళ ఆర్టీసీ తొలి ఏసీ బస్సు సర్వీసుకు మంత్రి గురువారం రాత్రి జెండా ఊపారు. ఈ కార్యక్రమానికి ముందు చెన్నై, బెంగళూరు, హైదరాబాదు ప్రాంతాల నుంచి విమానాలు దిగిన ప్రయాణికులకు మంత్రి పూలు, అయ్యప్ప పటాలు అందించి స్వాగతం పలికారు. తిరువనంతపురం విమానాశ్రయం నుంచి రూ.340, కొచిన్ నుంచి రూ.380 బస్సు ఛార్జీగా నిర్ణయించారు. ఈ సీజను మొత్తం అందుబాటులో ఉండే ఈ బస్సులకు ముందుగా బుకింగు చేసుకోవాల్సి ఉంటుంది. కేఎస్ఆర్టీసీ వెబ్‌సైటులో లేదా విమాన టికెట్ల బుకింగ్ పోర్టళ్ల ద్వారా బస్సు టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

యూజర్ చార్జీలను ఎప్పటికప్పుడు సవరించండి

అమరావతి: పన్నేతర రాబడిని గణనీయంగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖ సంబంధిత శాఖలకు సూచించింది. కొన్ని సంవత్సరాలుగా పన్నేతర ఆదాయంలో పెరుగుదల లేదని, ఇందుకు ప్రధాన కారణం పరిపాలన విభాగాలు క్రమానుగతంగా చార్జీలను సవరించకపోవడమేనని తెలిపింది. అలాగే పన్ను రాబడులు పెంచేందుకు సంబంధిత శాఖలు ప్రతిపాదనలను సమర్పించాలని కోరింది. 2027--28 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలు, ప్రస్తుత ఆర్థిక ఏడాది సవరించిన అంచనాల సమర్పణకు సమగ్ర సూచనలు చేస్తూ ఆర్థిక ముఖ్యకార్యదర్శి పీయూష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఫిబ్రవరిలో 2027--28 బడ్జెట్‌ను అసెంబ్లీకి సమర్పించనున్నట్లు తెలిపారు.

ఈ నేపథ్యంలో నిధి ఆర్థికశాఖ పోర్టల్‌లో వచ్చే నెల 23వ తేదీలోగా అన్ని శాఖలు బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. పన్నేతర రాబడి తగ్గుతోందని, ఇందుకు చార్జీలు సవరించకపోవడంతో పాటు పర్యవేక్షణ లేకపోవడమే కారణమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడున్న స్థాయి కంటే పన్నేతర ఆదాయం పెంచేందుకు గట్టిప్రయత్నాలు చేయాలని సూచించారు. అన్ని శాఖలు అన్ని వనరులను సమీక్షించి పన్నేతర రాబడి పెంచేందుకు నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. వివిధ రకాల వడ్డీలు, డివిడెండ్‌లు రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలని, పరిపాలన విభాగాల్లో పటిష్టమైన పర్యవేక్షణతో లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. ఆర్థిక వనరులను పెంచాల్సి ఉన్నందున బకాయిల వసూళ్ల కోసం హెచ్‌వోడీలు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు.

ఉత్తర్వుల్లో పేర్కొన్న మరికొన్ని సూచనలు..

పన్ను రాబడులను ప్రస్తుత పన్ను రేట్లు ఆధారంగా అంచనాలను ప్రతిపాదించాలి. వసూలు చేయాల్సిన బకాయిలతో కలిపి సహేతుకమైన వృద్ధితో పన్ను రాబడి ప్రతిపాదనలతో పాటు కొత్తగా ఆర్థిక వనరులు పెంచేందుకు అవసరమైన ప్రతిపాదనలను చేయాలి. ప్రస్తుత సంవత్సరంలో బకాయిల వసూళ్లను అంచనా వేయాలి.

కొత్తగా ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ప్రతిపాదించవద్దు. ప్రస్తుతం ఉన్న సిబ్బందిని సమీక్షించడం ద్వారా తగ్గించాలి. ప్రాజెక్టులు, పథకాలకు సంబంధించిన సిబ్బంది వేతనాలకు మంజూరు ఉత్తర్వులతో ఒప్పంద సేవలకు అవసరమైన నిధులు ప్రతిపాదించాలి.

సంబంధిత శాఖల ఆమోదం తరువాతనే కన్సల్టెంట్స్, రిటైర్డ్ ఉద్యోగుల పునర్నియామకాలకు వేతనాలు ప్రతిపాదించాలి. ప్రభుత్వం నుంచి అనుమతి లేని ఎటువంటి అంశాలకు కేటాయింపులు ప్రతిపాదించరాదు.

మౌలిక సదుపాయాల మూలధన వ్యయానికి అప్పులపైనే ఆధారపడాలి. కనెక్టివిటీ, గృహనిర్మాణం, తాగునీరు, విద్య, ఆరోగ్యంతో పాటు పారిశ్రామికీకరణ వంటి మూలధన వ్యయ వనరుల ప్రతిపాదనలను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ), ఈఏపీ, నాబార్డు, హడ్కోల నుంచి రాబట్టేలాగ దృష్టిలో ఉంచుకుని సంబంధిత ఇంజనీర్లు పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. వేతనేతర వ్యయంలో 20 శాతం పొదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

పథకాల వ్యయానికి ప్రతిపాదనలు సమర్పించడానికి ఆర్థికశాఖ ముందస్తు అనుమతి తీసుకోవాలి. మేనిఫెస్టో పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు అవసరమైన పూర్తి డేటాతో ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రతిపాదనలను సంబంధిత శాఖల అధికారులు సమీక్షించిన తరువాత పంపాలి. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ప్రతిపాదనలు కేంద్రానికి పంపే ముందు ఆర్థికశాఖ అనుమతి తీసుకోవాలి. రాష్ట్ర పథకాలు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల అర్హతలను సంబంధిత శాఖల అధికారులు సమీక్షించాలి. ఊహాజనిత గణాంకాలతో ప్రతిపాదనలు చేయవద్దు. బడ్జెట్ ప్రతిపాదనలతో పాటు సంబంధిత డాక్యుమెంట్లు, ఉత్తర్వులను శాఖాధిపతులు, సచివాలయ శాఖలు సమర్పించాలి.

మేయర్ శ్రావణికి పితృ వియోగం



సీతంపేట: విశాఖపట్నం నగర మేయర్‌గా ఇటీవల ఎన్నికైన ముక్కా శ్రావణి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె తండ్రి, మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాలనాయుడు శుక్రవారం గుండె పోటుతో మృతిచెందారు. ఇంట్లో నిద్రిస్తున్న ఆయన ఉదయం 7 గంటలైనా బయటకు రాకపోవడంతో, కుటుంబ సభ్యులు గుర్తించి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ముత్యాలనాయుడు పారీ?టలో క్రియాశీలక నేతగా కొనసాగుతూ 2007లో జీవీఎంసీ కార్పొరేటర్‌గా గెలుపొందారు. ఇటీవల జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో పెద్ద కుమార్తె నీలవేణి 49వ వార్డు కార్పొరేటర్‌గా, చిన్న కుమార్తె శ్రావణి నగర మేయర్‌గా గెలుపొందటంతో కుటుంబంలో పండగ వాతావరణం నెలకొంది. శ్రావణి మేయర్‌గా 23న ప్రమాణస్వీకారం చెయ్యనున్నారు. దానికి రెండు రోజుల ముందే ఇలా జరగడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరులు, పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పార్టీ నాయకులు, అభిమానుల సందర్శనార్థం భౌతిక కాయాన్ని అక్కయ్యపాలెం ఎన్జీవోస్ కాలనీలోని పార్టీ కార్యాలయం వద్ద ఉంచారు. శనివారం ఉదయం ఆయన స్వగ్రామమైన సీతారాంపురంలో అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కుమారుడు ముక్కా కిశోర్‌కుమార్ తెలిపారు.

అడ్డుగోలు విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోం : చిన్నశ్రీను



ఎన్నికలకి ముందు ఎన్ని విమర్శలు చేసుకున్నా ఊరుకుంటాం గానీ, ప్రజాతీర్పు వచ్చిన తరువాత కూడా అడ్డుగోలు విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని జెడ్పీ మాజీ చైర్మన్, టిడిపి నాయకులు మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఓట్లు కోసం, ప్రజా సానుభూతి కోసం ఎంతగా విమర్శించినా ఎన్నికలు అన్నాక అవి సహజమేనని అన్నారు. కాని, అదే పనిగా ఒక అబద్ధాన్ని నిజం చేసేందుకు విమర్శలు చేస్తూ ఉంటే ఉపేక్షించమన్నారు. స్థానిక ఎన్నికలలో వచ్చిన ఫలితాలు గెలిచిన వారికి బాధ్యతను పెంచితే, ఓడిపోయిన వారికి సమీక్షించుకునే అవకాశం ఇస్తుందన్నారు. ఎక్కడ తప్పులు చేశారో తెలుసుకుని, ఆ తప్పులను సరిదిద్దుకుంటే జిల్లాలో వైఎస్సార్సీపి కొద్ది కాలంపాటు తన ఉనికిని కాపాడుకోగలదని అన్నారు. లేకుంటే అతి తక్కువ కాలంలోనే అంతర్ధానం చెందడం ఖాయమన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో మార్పు వేగంగా జరుగుతోందన్నారు. రానున్న కాలంలో కూడా మరెన్ని మార్పులు సంభవించడం ఖాయమన్నారు. పని చేసిన వారిని, తమ కోసం నిలిచిన వారిని నెత్తిన పెట్టుకోవడానికి జిల్లా ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పడానికి ఈ ఫలితాలే తార్కాణమన్నారు. బిసిలకు అన్యాయం జరిగిపోయిందని అంటున్న వారు ఎక్కడ జరిగిపోయిందో చెప్పగలరా అని ప్రశ్నించారు. తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన తన కుమార్తెకి చైర్మన్ పదవిని, కొప్పుల వెలమ సామాజిక వర్గానికి చెందిన నీరజని వైస్ చైర్మన్ చేయడం బిసిలకు అన్యాయం చేయడం అవుతుందా అన్నారు. విజయనగరం మేయర్ పదవి ఓసిలకు రిజర్వు చేశారన్నారు. బిసిలు అధికంగా ఉన్న విజయనగరంలో ఓసిని ఆ ఎన్నికలలో ఏ విధంగా వైఎస్సార్సీపి అవకాశం కల్పించిందో చెప్పగలరా అని అన్నారు. ఎమ్మెల్యే వాళ్లే, మేయర్ వాళ్లే, చివరి కార్పొరేటర్ కూడా ఆ ఇంటి వాళ్లే పోటీ చేయడం సహేతుకమేనా అని ప్రశ్నించారు. అదే తెలుగుదేశం పార్టీ నాగవంశం కులానికి చెందిన బిసి మహిళకు మేయర్ పదవి దక్కేటట్లు చేసిందన్నారు. అంతేకాకుండా బొబ్బిలి మునిసిపల్ చైర్ పర్సన్ సీటుని తూర్పుకాపు సామాజిక వర్గానికి టిడిపి కేటాయిస్తే, పట్టుమని 500 ఓట్లుకూడా లేని ఓసికి ఆ చైర్ పర్సన్ సీటుని వైఎస్సార్సీపి ఇవ్వలేదా అని నిలదీశారు. విమర్శ చేసేటప్పుడు మన పరంగా జరిగిన తప్పులేమిటో ఒకసారి పరిశీలన చేసుకుని చేస్తే బాగుంటుందన్నారు. పూసపాటిరేగ మండలంలో జరిగిన వ్యవహారం చిన్న సాంకేతిక పరమైన లోపం తప్ప మరొకటి కాదన్నారు. దానిని భూతద్దంలో చూపించడం సరికాదన్నారు. ఈ ఎన్నికలలో ఎక్కడైనా ఒక కేసు నమోదు అయ్యిందా అని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఎన్నికలు ముగిసాయన్నారు. ఇప్పటికైనా తప్పులు సరిదిద్దుకునే చర్యలు చేపట్టుకోవడం మంచిదని సూచించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ బిసిలకు, అందునా బిసి మహిళలకు 50 శాతం స్థానిక సంస్థల్లో పార్టీ పరంగా కేటాయించడం సాహసోపేతమైన నిర్ణయమన్నారు. టిడిపికి బిసిలే వెన్నుముక అన్నారు. బిసిలను రాజకీయంగా ప్రోత్సహించిన పార్టీయే టిడిపి అన్నారు. అటువంటిది బిసిలకు వ్యతిరేకంగా వ్యవహరించిందని మండలి ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యన్నారాయణ విమర్శలు చేయడం తగదన్నారు.

కార్తీక పౌర్ణమి వేళ 'బీవర్ మూన్'..



న్యూఢిల్లీ: ఈ నవంబర్ 24న ఆకాశంలో అరుదైన ఖగోళ దృశ్యం ఆవిష్కృతం కానుంది. ఆరోజు ఏర్పడనున్న బీవర్ మూన్ హిందువులు పవిత్రంగా భావించే కార్తీక పౌర్ణమితో కలిసి రావడం విశేషం. ఈ ఏడాది చివర్లో వరుసగా ఏర్పడనున్న మూడు సూపర్ మూన్‌లలో ఇదే మొదటిది. నవంబర్ 23, 24 తేదీల్లో చంద్రుడు దాదాపు సంపూర్ణంగా కనిపించనున్నాడు. నవంబర్‌లో పౌర్ణమి నాటి చంద్రుడిని 'బీవర్ మూన్' అంటారు. ఉత్తర అమెరికాలో నవంబర్ నాటికి బీవర్లు (ఎలుక జాతిక చెందిన జీవులు) శీతాకాలం కోసం ఆహారాన్ని నిల్వ చేసుకుని, తమ గూళ్లు/ఆనకట్టలను నిర్మించుకుని వాటిలోకి చేరతాయి.ఈ సమయంలో వచ్చే చంద్రుడు కనుకనే 'బీవర్ మూన్' అంటారు. రాయల్ మ్యూజియమ్స్ గ్రీన్‌విచ్ ప్రకారం.. నవంబర్ 24న ఉదయం 9.53 గంటలకు (అమెరికా తూర్పు కాలమానం) పౌర్ణమి గరిష్ఠ దశకు చేరుకుంటుంది. హిందూ పంచాంగం ప్రకారం.. నవంబర్ 23 రాత్రి 11.42 గంటలకు కార్తీక పౌర్ణమి తిథి ప్రారంభమై, నవంబర్ 24 రాత్రి 8.23 గంటలకు ముగుస్తుంది. ఈ సందర్భంగా భక్తులు పూజలు, దానధర్మాలు, పవిత్ర స్నానాలు, దీపారాధనలు నిర్వహిస్తారు. కార్తీక పౌర్ణమినే దేవదీపావళిగా కూడా జరుపుకుంటారు.

ఆ 8.5 లక్షల పుస్తకాలపై గౌరవం చూపండి



ఢిల్లీ : దాదాపు 135 సంవత్సరాల నాటి కేంద్ర సచివాలయ గ్రంథాలయంలోని 8.5 లక్షల పుస్తకాలను భద్రపరిచేందుకు తగిన ఏర్పాట్లు చేయకుండా ఆ గ్రంథాలయాన్ని మరో చోటుకు బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించడాన్ని సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా తప్పపట్టింది. సెంట్రల్ విస్టా అభివృద్ధి ప్రణాళికలో భాగంగా గ్రంథాలయాన్ని బదిలీ చేయాలని ప్రతిపాదించారు. ప్రణాళికలో భాగంగా కూల్చివేయాలని ప్రతిపాదించిన శాస్త్రి భవన్‌లో ప్రస్తుతం కేంద్ర సచివాలయ గ్రంథాలయం ఉంది. గ్రంథాలయ వారసత్వాన్ని కొనసాగించే విషయంలో ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికేదీ లేకుండా తక్షణ నిర్ణయం ఆధారంగా చర్యలు చేపట్టినట్టు కనిపిస్తోందని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవాల ధర్మాసనం పేర్కొంది. "మీకు ఆ పుస్తకాలు అవసరం లేకపోతే మరో దేశానికి వాటిని అప్పగించండి. కనీసం అక్కడైనా వాటికి గౌరవం లభిస్తుంది. పుస్తకాల పట్ల కనీస గౌరవం చూపండి. ఎనిమిదిన్నర లక్షల పుస్తకాలను గాలిలోకి విసిరేస్తున్నారు" అని న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. నవంబరు కల్లా పుస్తకాలను మరో చోటికి మార్చేందుకు తొందర చూపుతున్నారని ఈ వ్యవహారంలో కోర్టుకు సహాయకారిగా నియమితులైన సీనియర్ న్యాయవాది హరిప్రియా పద్మనాభన్ అన్నారు. ఈ బదిలీని ఆపాలని ఆమె అభ్యర్థించారు.

తెరుచుకున్న శబరిమల ఆలయం



శబరిమల: 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ వేల గొంతుకలు ఒక్కటై శరణు ఘోష చేస్తుండగా కేరళంలోని ప్రఖ్యాత శబరిమల అయ్యప్ప ఆలయం వార్షిక మండల యాత్ర సీజన్ కోసం సోమవారం తెరుచుకుంది. తంత్రి కండారు బ్రహ్మదత్తన్ సమక్షంలో.. నిరుటి ప్రధాన పూజారి ఇ.డి.ప్రసాద్ నంబూద్రీ ఆలయాన్ని తెరిచి, జ్యోతి వెలిగించారు. 18 పవిత్ర మెట్లు దిగొచ్చి.. కొత్తగా నియమితులైన పూజారులను సన్నిధానానికి (ఆలయ సముదాయం) తోడ్కొని వెళ్లారు. అనంతరం ఎ.దామోదరన్ నంబూద్రీ నూతన ప్రధాన పూజారిగా బాధ్యతలు చేపట్టారు. వేల మంది భక్తులు తరలి రావడంతో.. ఆలయ ద్వారాలు తెరుచుకోక ముందు నుంచీ సన్నిధానమంతా 'స్వామియే శరణం అయ్యప్ప' అన్న శరణు ఘోష ప్రతిధ్వనించింది. మండల యాత్ర సీజన్ మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు లాంఛనంగా ప్రారంభమవుతుంది. డిసెంబరు 27న మండల పూజ చేస్తారు. అదే రోజు ఆలయాన్ని మూసివేసి.. మకర విళక్కు యాత్ర సీజన్ కోసం డిసెంబరు 30న తిరిగి తెరుస్తారు. మకర విళక్కు ఉత్సవాన్ని జనవరి 14న నిర్వహిస్తారు. జనవరి 30న ఆలయాన్ని మూసివేస్తారు. ఈ సీజన్‌లో రోజుకు 80 వేల మంది భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు.

ఈవీ ఛార్జింగ్ స్టేషన్లకు భారతీయ పేటెంట్


ఢిల్లీ : విద్యుత్తు వాహనాల (ఈవీ) ఛార్జింగ్ స్టేషన్లను మరింత సమర్థంగా, పర్యావరణ హితంగా మార్చే ఒక కొత్త టెక్నాలజీకి రవుర్కెలాలోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (ఎన్ఐటీ) పేటెంట్ సాధించింది. భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా విద్యుత్తు వాహనాల వాడకం భారీగా పెరగడంతో, ఛార్జింగ్ స్టేషన్ల అవసరం కూడా పెరిగింది. స్టేషన్లు నిర్మించడమే కాకుండా, వాటి డిజైన్‌లో సాంకేతిక సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. రవుర్కెలా ఎన్ఐటీ ప్రొఫెసర్ ప్రవత్ కుమార్ రే తెలిపిన వివరాల ప్రకారం, వీరి బృందం సౌరశక్తి ఆధారిత ఈవీ ఛార్జింగ్ మైక్రోగ్రిడ్‌ను రూపొందించింది. ఇది సోలార్ ప్యానెల్స్, సాధారణ కరెంట్ గ్రిడ్, బ్యాటరీలు, సూపర్ కెపాసిటర్లతో కూడిన ప్రత్యేక ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను అనుసంధానిస్తుంది. వోల్టేజీని ఈ కొత్త టెక్నాలజీ నియంత్రించగలదు. "మబ్బులు పట్టినప్పుడు, పగలూరాత్రి తేడాల వల్ల సౌరశక్తితో నడిచే ఛార్జింగ్ స్టేషన్లలో కరెంట్ ఉత్పత్తిలో హెచ్చుతగ్గులు వస్తుంటాయి. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు అదనపు విద్యుత్తును బ్యాటరీలలో నిల్వచేసి, ఎండ లేనప్పుడు వాడుకోవచ్చు" అని ప్రొఫెసర్ రే చెప్పారు. ప్రస్తుతం విద్యుత్తు వాహనాలు మెయిన్ పవర్ గ్రిడ్ నుంచి కరెంట్ తీసుకుంటున్నాయి. దీనిని గ్రిడ్-టు-వెహికల్ (జి2వీ) ఛార్జింగ్ అంటారు. దీనికి పూర్తి వ్యతిరేకంగా, అవసరమైనప్పుడు వాహనాల బ్యాటరీల నుంచే తిరిగి మెయిన్ గ్రిడ్‌కు కరెంట్‌ను అందించే టెక్నాలజీని వెహికల్-టు-గ్రిడ్ (వీ2జి) అంటారు. అంటే మన కారు బ్యాటరీని ఒక చిన్న పవర్ బ్యాంకులా వాడుకుని, ఇంట్లో లేదా గ్రిడ్‌లో కరెంట్ లేనప్పుడు తిరిగి ఇవ్వడం అన్నమాట. పరిశోధకుల బృందం ఇప్పటికే ఈ వ్యవస్థకు సంబంధించిన ఒక నమూనాను తయారు చేసి, కృత్రిమంగా సృష్టించిన సోలార్ ఉత్పత్తి, విద్యుత్ డిమాండ్ మార్పుల మధ్య విజయవంతంగా పరీక్షించింది.

కాలుష్యంలో దిల్లీ టాప్

ఢిల్లీ : దేశంలోని అన్ని రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల రాజధానుల్లో దిల్లీ అత్యంత కాలుష్య నగరంగా నిలిచిందని థింక్ ట్యాంక్ ఎన్విరోకాటలిస్ట్ నివేదిక వెల్లడించింది. గతేడాది దీపావళి నుంచి ఈ ఏడాది దీపావళి (పండుగ రోజులు మినహా) వరకు నగరంలో వార్షిక సగటు పీఎం స్థాయి 2.5 సాంద్రత క్యూబిక్ మీటరుకు 94 మైక్రోగ్రాములు నమోదైందని తెలిపింది. ఇది జాతీయ వార్షిక సగటు 40 మైక్రోగ్రాముల కంటే 2.3 రెట్లు, ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం 5 మైక్రోగ్రాముల కంటే 18.7 రెట్లు ఎక్కువని పేర్కొంది. దిల్లీ తర్వాత జైపుర్ 54, లఖ్‌నవూ 52, కోల్‌కతా 48, పట్నా 47, భువనేశ్వర్ 46, దేహ్రాదూన్ 45, గువాహటి 42, భోపాల్ 42, నహర్లాగూన్ 41 మైక్రోగ్రాములతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. కాలుష్యంలో దాదాపు 97 శాతం వాహనాలు, నిర్మాణ ధూళి, గృహ ఇంధనాలు, చెత్త, పంట వ్యర్థాల దహనం వల్లే వస్తోందని నివేదిక వెల్లడించింది.

మహిళా బిల్లు.. బీజేపీకి ఎన్నికల అస్త్రమా?

- రాజకీయ ప్రయోజనాల కోసమే బీజేపీ బిల్లుల ఎత్తుగడనా?
- రిజర్వేషన్ల చాటున డీలిమిటేషన్ రాజకీయం
- మహిళా బిల్లుతో మరోసారి ఎన్నికల ఎత్తుగడ



అమరావతి: ఎన్నికలు సమీపిస్తే చాలు.. మహిళా రిజర్వేషన్ల అంశాన్ని తెరపైకి తీసుకురావడం, రాజకీయంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నించడం బీజేపీకి ఆనవాయితీగా మారిందా? మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ చిత్తశుద్ధిని విపక్షాలతో పాటు మిత్రపక్షాలు సైతం ప్రశ్నిస్తున్నాయి. ఎన్నికల రాజకీయాలకు అనుగుణంగా ఈ బిల్లులను పావులుగా ఉపయోగించు కుంటోందన్న విమర్శలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 2023 సెప్టెంబర్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదింపజేసింది కేంద్ర ప్రభుత్వం. అయితే, బిల్లు ఆమోదం పొందినంత మాత్రాన మహిళలకు తక్షణమే రిజర్వేషన్లు అమల్లోకి రాలేదు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తయిన తర్వాతే అమలు సాధ్యమనే నిబంధనను చేర్చడంతో అసలు ఉద్దేశంపైనే ప్రశ్నలు తలెత్తాయి. బిల్లును ఆమోదించిన ఘనతను ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకోవాలని బీజేపీ ప్రయత్నించిందని, కానీ దాని అమలుపై స్పష్టత ఇవ్వలేదని విపక్షాలు విమర్శించాయి. ఆ తర్వాత మహిళా రిజర్వేషన్ల అంశానికి డీలిమిటేషన్‌ను జోడిస్తూ బీజేపీ మరోసారి రాజకీయ వివాదానికి తెరలేపిందన్న ఆరోపణలు వచ్చాయి. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను కేంద్రం తెరపైకి తీసుకురావడం చర్చకు దారితీసింది. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని విపక్షాలు చెప్పేలా చేసి, ఆ వాదనను ఎన్నికల ప్రచార అస్త్రంగా మలుచుకోవాలన్నదే బీజేపీ వ్యూహమని విపక్ష నేతలు ఆరోపించారు. అయితే మహిళా రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడంపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో లోక్‌సభలో ఎన్డీఏ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. సంబంధిత బిల్లు ఆమోదం పొందకపోవడంతో కేంద్రం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. అయినప్పటికీ, మరోసారి ఈ రెండు బిల్లులను పార్లమెంట్ ముందుకు తీసుకొస్తామని బీజేపీ నేతలు ప్రకటిస్తుండటం రాజకీయ చర్చకు దారితీస్తోంది.

2027 తొలి ఐదు నెలల్లో ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్‌తో పాటు మరో రెండు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు, డీలిమిటేషన్ అంశాలను మళ్లీ తెరపైకి తీసుకొచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. రాబోయే ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందడమే లక్ష్యంగా ఈ వ్యవహారాన్ని నడిపిస్తోందని మండిపడుతున్నాయి. బీజేపీ మిత్రపక్షాల నుంచి కూడా ఇదే తరహా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

మహిళలకు నిజంగా 33 శాతం ప్రాతినిధ్యం కల్పించాలన్న చిత్తశుద్ధి కేంద్ర ప్రభుత్వానికి ఉంటే, డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా ప్రస్తుతం ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ స్థానాల్లోనే రిజర్వేషన్లు అమలు చేయవచ్చుకదా? అన్నది విపక్షాల ప్రధాన ప్రశ్న. ఈ విషయంలో కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి.

మరోవైపు డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా నియోజకవర్గాల స్వరూపాన్ని మార్చి, రాజకీయంగా తమకు అనుకూలమైన పరిస్థితులు సృష్టించుకోవాలన్న ఉద్దేశంతోనే మహిళా రిజర్వేషన్లను కేంద్రం సాకుగా ఉపయోగించు కుంటోందన్న ఆరోపణలు కూడా వినిపిస్తు న్నాయి. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలన్న కీలక అంశాన్ని ఎన్నికల అవసరాలకు అనుగుణంగా వాడుకోవడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాం శంగా మారింది.

మహిళా సాధికారతకు నిజమైన ప్రాధాన్యమా? లేక ఎన్నికల రాజకీయాల్లో మరో వ్యూహాత్మక అస్త్రమా? అన్న సందేహాలు ఈ పరిణామాలతో మరింత బలపడుతున్నాయి.

పంచాయతీ ఎన్నికల్లోనూ జైత్రయాత్ర కొనసాగించాలి : కూటమి



అమరావతి: పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి జైత్రయాత్ర కొనసాగించాలని తెదేపా, జనసేన, భాజపా అగ్రనేతలు ప్రజలకు పిలుపునిచ్చారు. ఇటీవల స్థానిక ఎన్నికల్లో కూటమికి కట్టబెట్టిన విజయాన్ని పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని కోరారు. అమరావతిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు, నాదెండ్ల మనోహర్, పీవీఎన్ మాధవ్ మీడియాతో మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో సాధించిన విజయంతో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌ను మరింత పరుగులు పెట్టిస్తామని పల్లా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. గొడ్డలి పార్టీ దుర్మార్గాలను అడ్డుకున్నామని, పులివెందులలో తొలిసారిగా ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేశారని అన్నారు. కూటమి ఐక్యతను క్షేత్రస్థాయిలో కొనసాగిస్తున్నామని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. సమాజానికి సేవ చేయాలనే యువతకు స్థానిక ఎన్నికల్లో అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. మూడు తుపాన్లు రాష్ట్రాన్ని ముంచెత్తినా.. ప్రజలు కూటమికి స్పష్టమైన తీర్పునిచ్చారని మాధవ్ అన్నారు. ప్రభుత్వ పాలనకు నిదర్శనంగానే రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. ప్రజలు అభివృద్ధిని బేరీజు వేసుకుని పంచాయతీ, రెండో దశ మున్సిపల్ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ముగ్గురు నేతలు విజ్ఞప్తి చేశారు.

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఓడిన చోట సమన్వయ లోపం ఉందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అంగీకరించారు. మూడు పార్టీల మధ్య సమన్వయంలో ఎక్కడ పొరపాట్లు జరిగాయో సమీక్షించుకుంటామని వెల్లడించారు. పంచాయతీ, రెండో దశ మున్సిపల్ ఎన్నికల్లో అలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడతామన్నారు. తదుపరి దశ ఎన్నికల్లో వందశాతం ఫలితాలే లక్ష్యంగా మూడు పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతాయని స్పష్టం చేశారు.

రూ.3 వేల జీతం.. కోట్ల రూపాయల పెట్టుబడి!

- సర్పంచ్ పదవా.. సేవ చేయడానికా..? గ్రామంపై పెత్తనం చెలాయించడానికా..!
- ఏకగ్రీవాల ముసుగులో ఆర్థిక లావాదేవీల చర్చ..
- వేలం పాటలతో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం!

గ్రామానికి ప్రథమ పౌరుడు సర్పంచ్. ప్రజల సమస్యలు పరిష్కరించడం, గ్రామాభివృద్ధికి నిధులు వినియోగించడం ఆయన ప్రధాన బాధ్యత. కానీ ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో సర్పంచ్ పదవికి కనిపిస్తున్న డిమాండ్ చూస్తుంటే అసలు లక్ష్యం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నెలకు కేవలం రూ.3 వేల గౌరవ వేతనం వచ్చే పదవి కోసం లక్షలు, కోట్లు వెచ్చించేందుకు సిద్ధపడటం వెనుక ఆంతర్యమేమిటి? ప్రజాసేవ చేయాలన్న తపనా..? లేక ఐదేళ్ల పాటు గ్రామంపై ఆధిపత్యం చెలాయించాలన్న ఆకాంక్షా..? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.

రూ.3 వేల జీతం.. కోట్ల పెట్టుబడి!

సర్పంచ్‌గా ఎన్నికైన వారికి ప్రభుత్వం అందించే గౌరవ వేతనం నెలకు సుమారు రూ.3 వేలే. ఈ మొత్తంతో కుటుంబ పోషణ కూడా సాధ్యం కాని పరిస్థితి. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఈ పదవి కోసం భారీ మొత్తాలు ఖర్చు చేస్తున్నారనే ప్రచారం వినిపిస్తోంది. మరికొన్ని చోట్ల ఏకగ్రీవ ఎన్నికల పేరుతో భారీగా డబ్బులు, భూముల ఆఫర్లు తెరపైకి వస్తున్నాయనే చర్చ సాగుతోంది. అసలు నెలకు రూ.3 వేల గౌరవ వేతనం వచ్చే పదవికి కోట్ల రూపాయలు వెచ్చించాల్సిన అవసరం ఏమొచ్చింది? ఎన్నికల్లో పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఒక ఎత్తయితే.. డబ్బు ఆశ చూపించి పదవిని దక్కించుకోవడం మరో ఎత్తు. ఈ రెండింటి మధ్య ఉన్న తేడాను గుర్తించాల్సిన అవసరం ఉంది.

చెక్‌పవర్.. అసలు ఆకర్షణ!

సర్పంచ్ పదవికి జీతం తక్కువే అయినా.. గ్రామ పరిపాలనలో కీలకమైన బాధ్యతలు ఉంటాయి. గ్రామ పంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధి పనుల ప్రాధాన్యత, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో సర్పంచ్ పాత్ర కీలకం. గ్రామానికి వచ్చే నిధులు, వాటి వినియోగంపై ప్రజాప్రతినిధిగా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ అధికారాలు, స్థానికంగా లభించే గుర్తింపు, రాజకీయ పలుకుబడి కొందరిని పదవివైపు ఆకర్షిస్తున్నాయనే విశ్లేషణలు ఉన్నాయి.

ఏకగ్రీవమా..? వేలం పాటనా..?


ఏకగ్రీవ ఎన్నిక అంటే గ్రామ ప్రజలందరూ ఒక అభ్యర్థిపై స్వచ్ఛందంగా ఏకాభిప్రాయానికి రావడం. కానీ కొన్ని చోట్ల ఈ ప్రక్రియకు భిన్నంగా ఆర్థిక లావాదేవీల ప్రస్తావన రావడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామ పెద్దల సమక్షంలో పదవిని వేలం వేసినట్లు వ్యవహరించడం, అత్యధిక మొత్తం ఆఫర్ చేసిన వారికి అవకాశం కల్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిణామాలు నిజమైతే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువ ఏమవుతుందన్న ప్రశ్న ఎదురవుతోంది.

కోట్ల ఖర్చు వెనుక నాలుగు కారణాలపై చర్చ!

గ్రామంపై ఆధిపత్యం: ఐదేళ్ల పాటు గ్రామ రాజకీయాల్లో కీలక స్థానంలో ఉండటం, స్థానికంగా తమ కుటుంబం లేదా వర్గం పలుకుబడిని పెంచుకోవడం కొందరి లక్ష్యంగా కనిపిస్తోంది.

అభివృద్ధి పేరుతో ఏకగ్రీవం: ఎన్నికల ఖర్చులు, గ్రామంలో రాజకీయ ఘర్షణలు తగ్గుతాయని, వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని దేవాలయాలు, పాఠశాలలు, రహదారుల అభివృద్ధికి వినియోగించవచ్చని కొందరు వాదిస్తున్నారు. అయితే ప్రజాస్వామ్య ఎన్నికలకు డబ్బును ప్రత్యామ్నాయంగా చూపించడం చర్చనీయాంశంగా మారుతోంది.

రాజకీయ హోదా: సర్పంచ్ పదవి ద్వారా మండల, జిల్లా స్థాయి రాజకీయాల్లో గుర్తింపు పొందవచ్చని, భవిష్యత్తులో ఉన్నత పదవులకు వెళ్లేందుకు పునాది పడుతుందని కొందరు భావిస్తున్నారు.



స్థానిక ప్రయోజనాలు :

గ్రామంలో జరిగే అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపు, స్థానిక నిర్ణయాల్లో తమ మాటకు ప్రాధాన్యం ఉండాలనే ఆకాంక్ష కూడా పోటీకి కారణమవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఓటు హక్కుకు వెల కడితే ప్రజాస్వామ్యానికి అర్థమేమిటి?

గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రజలకు తమ నాయకుడిని ఎన్నుకునే అవకాశం కల్పిస్తాయి. ఆ అవకాశాన్ని డబ్బు, ఆస్తుల ప్రలోభాలతో ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగితే సామాన్య అభ్యర్థులకు పోటీ చేసే అవకాశం తగ్గిపోతుంది. ఆర్థికంగా బలమైనవారికే పదవులు పరిమితమయ్యే ప్రమాదం ఉంది. సర్పంచ్ పదవి వ్యాపార పెట్టుబడి కాదు. గ్రామ ప్రజలు అప్పగించే బాధ్యత. ఐదేళ్ల పాటు ప్రజల తరఫున పనిచేయాల్సిన పదవిని ఆర్థిక బలప్రదర్శనకు వేదికగా మార్చడం వల్ల గ్రామాభివృద్ధి లక్ష్యం పక్కదారి పట్టే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నెలకు రూ.3 వేల గౌరవ వేతనం.. ఐదేళ్ల పదవీకాలం.. కానీ కోట్ల రూపాయల ఖర్చుపై చర్చ! ఈ లెక్కల వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? గ్రామానికి సేవ చేయాలనే సంకల్పమా? లేక గ్రామ రాజకీయాలపై పట్టు సాధించాలనే వ్యూహమా? ప్రజలు ఆలోచించాల్సిన ప్రశ్న ఇదే!

కష్టపడి రిగ్గింగ్ చేసినా విలువ లేకుండా పోయింది..!



అనంతపురం : స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి కుట్రలు, అరాచకం ఏ స్థాయిలో ఉన్నాయనేది తెలుగు తమ్ముళ్ల సాక్షిగా బయటపడింది. తాము ఎంతో కష్టపడి రిగ్గింగ్ చేశామనేది పేపర్లకు టీవీలకు వచ్చిందనే విషయాన్ని వారే ఒప్పేసుకుంటున్నారు. అయితే వారు రిగ్గింగ్ చేశామని ఒప్పుకోవడానికి కారణం లేకపోలేదు. తాము అంత కష్టపడి రిగ్గింగ్ చేసినా శింగనమల ఎంపీపీ సీటులో పోరు ఉత్కంఠగా మారడమే. అనంతపురం జిల్లా శింగనమల మండలంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీలకు సమానంగా ఎంపీటీసీ స్థానాలు దక్కడంతో ఎంపీపీ పీఠం ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో తెలుగు తమ్ముళ్ల నిజ స్వరూపం బయటకొచ్చింది. తాము ఇంత కష్టపడి రిగ్గింగ్ చేస్తే.. వైఎస్సార్‌సీపీ ఇక్కడ వరకూ రావడం ఏమిటనేది వారి బాధ. దాంతో టీడీపీ శ్రేణులే ఆక్రోశం ఆపుకోలేక రిగ్గింగ్ చేసిన విషయాన్ని బయటపెట్టేశాయి. శింగనమల నియోజకవర్గంలో ఎంపీపీ పదవి వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చాంశనీయంగా మారడమే కాదు.. తెలుగు తమ్ముళ్ల మీడియా సాక్షిగా మాట్లాడిన మాటలు కూడా వైరల్ అవుతున్నాయి. కష్టపడి రిగ్గింగ్ చేస్తే శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి తన అనుకూల వ్యక్తికి ఎంపీపీ సీటును అమ్ముకున్నారంటూ టీడీపీ శ్రేణులు రెచ్చిపోతున్నాయి. తమ నేత ఈశ్వర్‌రెడ్డికి ఎంపీపీ వస్తుందనుకుంటే.. దానిని తమ ఎమ్మెల్యే బండారు శ్రావణి తమకు కాకుండా చేశారని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

కర్బీ నృత్యంతో అద్భుత రికార్డు..
ఒకేసారి 15 వేల మందికి పైగా..



అస్సాం కళాకారులు సాంప్రదాయ నృత్యం కర్బీతో రికార్డు సృష్టించారు. సుమారు 15 వేల మందికి పైగా నృత్యకారులు ఒకేచోట చేరి సంప్రదాయ కర్బీ జానపద నృత్యం 'నిమ్సో కెరుంగ్' ప్రదర్శించి గిన్నిస్ రికార్డు నెలకొల్పారు. జిల్లా 75వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నవంబర్ 16 సోమవారం నాడు దిఫూలోని కాసా స్టేడియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ ప్రదర్శనలో వివిధ తెగలు, వర్గాలకు చెందినవారు పాల్గొని, ఆ ప్రాంత సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పడానికి సమన్వయంతో నృత్యం చేశారు.

ఈ ఘనతను గిన్నిస్ ప్రపంచ రికార్డ్స్ న్యాయనిర్ణేత అధికారికంగా ప్రకటించారు. అందుకు సంబంధించిన వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ..'కర్బీ ఆంగ్లాంగ్' చరిత్ర సృష్టించింది. దాఆపు 15,000 మందికి పైగా నర్తకులు కలిసి ప్రదర్శన ఇచ్చారు.'' అనే క్యాప్షన్‌ని జోడించారు. నృత్యకారులు సాంప్రదాయ దుస్తులను ధరించి, కర్బీ సంగీ వాయిద్యాల లయలకు అనుగుణంగా నృత్యం చేస్తూ..స్టేడియంలో ఒక రంగుల దృశ్యాన్ని సృష్టించారు.

గిన్నిస్ రికార్డ్స్ అధికారిక న్యాయనిర్ణేత స్వప్నిల్ దంగారికర్, ఈ నృత్యంలో పాల్గొన్నవారి ఉత్సాహాన్ని ప్రశంసించారు. పైగా వాళ్లు నృత్యం చేస్తూ సంబరాలు చేసుకోవడం చూస్తుంటే ఒళ్లు గగుర్పొడించిందన్నారు. అందుకే మళ్లీ ఇక్కడికి వచ్చి ఇలాంటివి మరిన్ని చూడాలనుకుంటున్నా అని అన్నారు. ఈ ప్రదర్శన ఐక్యతకు, సాంస్కృతిక సంప్రదాయాలకు ఒక అద్భుతమైన నిదర్శనమని అభివర్ణించారు. కాగా, అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్ అనే జిల్లా ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో నవంబర్ 15 నుంచి 17 వరకు జరిగి వేడుకల్లో భాగంగానే ఈ రికార్డు ప్రదర్శనను నిర్వహించారు. అస్సాం ముఖ్యమంత్రి బిస్వా శర్మ కూడా కళాకారులను అభినందించారు. 1951లో కర్బీ ఆగ్లాంగ్ జిల్లా ఏర్పడిన జ్ఞాపకార్థం ప్రతి ఏడాది నవంబర్ 17న కర్బీ ఆంగ్లాంగ్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు.

విధుల్లో ఉండగా సెల్‌ఫోన్లు వాడొద్దు

న్యూఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌లో ఉగ్ర దాడుల నేపథ్యంలో కేంద్ర రిజర్వు పోలీసు విభాగం సీఆర్‌పీఎఫ్ నాయకత్వం అప్రమత్తమైంది. విధుల్లో ఉన్న సమయాల్లో సిబ్బంది భద్రతకు మరింత ప్రాధాన్యమిస్తూ కొత్తగా మార్గదర్శకాలను జారీ చేసింది. విధి నిర్వహణ సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు, రక్షణ హెల్మెట్లు ధరించాలని స్పష్టం చేసింది. ముఖ్యంగా, వ్యక్తిగత మొబైల్ ఫోన్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించింది. అత్యవసర అధికారిక సమాచార మార్పిడి కోసం పార్టీ కమాండర్ మాత్రమే మొబైల్ ఫోన్‌ను వాడాలని ఆదేశించింది. చెక్‌పోస్టుల వద్ద భద్రతను పెంచడంతో పాటు అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఇటీవల కుల్గాం జిల్లాలో జరిగిన దాడిలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గాయపడిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జీపీ సింగ్ ఇటీవల జమ్మూ కశ్మీర్‌లో పర్యటించి, భద్రతా పరిస్థితులపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఢిల్లీలోని బలగాల ప్రధాన కార్యాలయం నుంచి మరో సీనియర్ అధికారి కూడా ఆయన వెంట వెళ్లారు. ఉగ్రవాద నిరోధక చర్యలు, భద్రతా సిబ్బందిపై జరుగుతున్న దాడుల తీరును ఈ సందర్భంగా ప్రత్యేకంగా సమీక్షించారు. ముఖ్యంగా లష్కరే తోయిబా, అనుబంధ సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్)కు చెందిన స్థానిక కమాండర్ మహమ్మద్ లతీఫ్ భట్ అలియాస్ లతీఫ్ అహ్మద్ భట్ జరిపే దాడుల తీరుపై చర్చించారు. భద్రతా చెక్‌పోస్టుల వద్దకు చేరుకుని సిబ్బందిపై కాల్పులు జరిపే విధానాన్ని సమీక్షించారు. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాం జిల్లా ఖ్రేవాన్ చాదర్ గ్రామానికి చెందిన లతీఫ్ భట్‌కు జూలై 22న అనంత్‌నాగ్‌లో హెడ్ కానిస్టేబుల్ ఆశిక్ హుస్సేన్ ఖురేషీ హత్యతో సంబంధమున్నట్లు ఆరోపణలున్నాయి. అమర్‌నాథ్ యాత్ర విధుల్లో భాగంగా ఇతడు ఇండియన్ రిజర్వు పోలీస్‌లో పనిచేసే సమయంలో స్పెషల్ ఆపరేషన్స్ గ్రూపుకు అనుబంధంగా విధులు నిర్వహించాడు.



పల్నాడు జిల్లా పరిషత్ తొలి చైర్‌పర్సన్‌గా పుచ్చకాయల రమాదేవి

సత్తెనపల్లి ప్రతినిధి : నరసరావుపేట పల్నాడు జిల్లా పరిషత్ నూతన పాలకవర్గ ఏర్పాటు, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌ల ఎన్నిక మరియు ప్రమాణ స్వీకార కార్యక్రమం నరసరావుపేటలో ఘనంగా నిర్వహించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ కృత్తికా శుక్లా, ఐఏఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా పరిషత్ తొలి చైర్‌పర్సన్‌గా పుచ్చకాయల రమాదేవి, వైస్ చైర్‌పర్సన్‌గా నల్లపాటి కీర్తన నూతన బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పరిషత్‌కు నూతన నాయకత్వం ఏర్పడిన ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ముప్పాళ్ల జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా అనిత నూతన చైర్‌పర్సన్ పుచ్చకాయల రమాదేవిని, వైస్ చైర్‌పర్సన్ నల్లపాటి కీర్తనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. నరసరావుపేటలోని మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇద్దరు నాయకురాళ్లకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొర్రా అనిత మాట్లాడుతూ పల్నాడు జిల్లా పరిషత్‌కు తొలి చైర్‌పర్సన్‌గా పుచ్చకాయల రమాదేవి, వైస్ చైర్‌పర్సన్‌గా నల్లపాటి కీర్తన బాధ్యతలు స్వీకరించడం జిల్లాలోని ప్రజాప్రతినిధులకు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఒక ప్రత్యేక సందర్భమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులకు లభించే పదవులు ప్రజలకు సేవ చేయడానికి, వారి సమస్యలను పరిష్కరించడానికి లభించిన గొప్ప అవకాశాలని, ఆ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ కృత్తికా శుక్లా ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ, ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించబడిన ఈ సందర్భంగా నూతన పాలకవర్గం జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.




పల్నాడు జిల్లా పరిషత్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం, రహదారుల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, ప్రభుత్వ పాఠశాలలు, వైద్య సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని, అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరేలా కృషి చేయాలని సూచించారు. ముప్పాళ్ల మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్న బొర్రా అనిత, మండల పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా పరిషత్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ముప్పాళ్ల మండల అభివృద్ధికి, గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు, ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన చైర్‌పర్సన్ పుచ్చకాయల రమాదేవి, వైస్ చైర్‌పర్సన్ నల్లపాటి కీర్తన అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రజాప్రతినిధుల మధ్య పరస్పర సహకారం, అధికార యంత్రాంగంతో సమన్వయం, ప్రజల పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం ఉన్నప్పుడే అభివృద్ధి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సత్ఫలితాలను అందిస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. పదవులు అనేవి కేవలం హోదాకు, గుర్తింపునకు మాత్రమే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే సేవా బాధ్యతలుగా భావించాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లు పల్నాడు జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు సాగాలని, వారి పదవీకాలం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రగతికి ఉపయోగపడాలని బొర్రా అనిత ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు, బొర్రా సురేష్ బాబు, బొర్రా సరస్వతి, నాగేశ్వరమ్మ, బద్దుల ప్రకాష్ రావు, నాదెండ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొని నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లకు అభినందనలు తెలియజేశారు.



ఆటవస్తువు మాటున అప్పుల మంటలు!

- ఒక గేమ్ కోసం ఇంత ఆర్భాటమా?
- ప్రపంచాన్ని ఊపేస్తున్న జిటిఏ - 6 హైప్.. మధ్యతరగతి కుటుంబాలకు కొత్త తలనొప్పి!
- పిల్లల సరదా.. తల్లిదండ్రులకు ఆర్థిక గుదిబండ!
- ప్రచార ఆర్భాటం వెనుక వేల కోట్ల వ్యాపారం.. పిల్లల కోరికలకు అప్పుల భారం!





అమరావతి : ఒకవైపు పాఠశాల ఫీజులు.. మరోవైపు ఇంటి అద్దెలు.. ఇంకోవైపు నిత్యావసరాల ధరలు! రెక్కాడితే గానీ డొక్కాడని మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి ఇది. కష్టపడి సంపాదించిన ప్రతి రూపాయినీ పిల్లల చదువులు, భవిష్యత్తు కోసం దాచుకోవాలని తల్లిదండ్రులు తపన పడుతుంటే.. మరోవైపు ఖరీదైన వీడియో గేమ్‌లపై పెరుగుతున్న మోజు కొత్త ఆర్థిక భారంగా మారుతోందా? గ్రాండ్ తెఫ్ట్ ఆటో (జిటిఏ-6) చుట్టూ సాగుతున్న ప్రపంచవ్యాప్త ప్రచార హోరు యువతను ఆకర్షిస్తోంది. యూట్యూబ్, సోషల్ మీడియా, గేమింగ్ ఇన్‌ఫ్లుయెన్సర్ల హడావుడితో పిల్లల్లోనూ ఈ గేమ్‌పై ఆసక్తి పెరుగుతోంది. తమకూ గేమింగ్ కన్సోల్, ఖరీదైన కంప్యూటర్ కావాలంటూ తల్లిదండ్రులను అడుగుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోలేని వయసులో కోరికలు తీర్చాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. పిల్లల సంతోషం కోసం తల్లి దండ్రులు అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తే.. ఆ వినోదం విలువ ఎంత? పిల్లల భవిష్యత్తు కంటే గేమింగ్ పరికరాలే ముఖ్యమా?

అసలు ఈ గేమ్‌కు ఎందుకింత హైప్?

వీడియో గేమ్ అంటే ఒకప్పుడు కాలక్షేపం మాత్రమే. ఇప్పుడు అదొక భారీ వ్యాపార సామ్రాజ్యం! అందుకు తాజా ఉదాహరణ జి టి ఏ - 6. దాదాపు 13 ఏళ్ల విరామం తర్వాత కొత్త వెర్షన్ రావడంతో ప్రపంచవ్యాప్తంగా గేమింగ్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. అయితే ఈ స్థాయిలో హైప్ రావడానికి కారణాలేమిటి? ఒక గేమ్ కోసం ఇంత ప్రచార ఆర్భాటం ఎందుకు? 2023 డిసెంబరులో విడుదలైన తొలి ట్రైలర్ నుంచే జిటిఏ - 6 చర్చ మొదలైంది. రెండో ట్రైలర్ కూడా ప్రపంచవ్యాప్తంగా రికార్డు స్థాయి వీక్షణలు సాధించింది. సోషల్ మీడియా వేదికలు, యూట్యూబ్ ఛానళ్లు, గేమింగ్ ఇన్‌ఫ్లుయెన్సర్లు ఈ ప్రచారాన్ని మరింత విస్తరించారు. గేమ్ విడుదలకు ముందే అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి.

వినోదమే కాదు.. భారీ వ్యాపారం! : జిటిఏ-6 సిరీస్‌కు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులున్నారు. జిటిఏ -5 ఇప్పటికే 23 కోట్లకు పైగా కాపీలు అమ్ముడై భారీ వాణిజ్య విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో కొత్త వెర్షన్‌పై కంపెనీ పెట్టుబడులు, మార్కెటింగ్, అమ్మకాల అంచనాలు అంతర్జాతీయ గేమింగ్ పరిశ్రమలో ఆసక్తిని పెంచాయి. గేమింగ్ కంపెనీలకు ఇది భారీ వ్యాపార అవకాశం కావచ్చు. అభిమానులకు వినోదం కావచ్చు. కానీ ఆ ప్రచార ప్రభావం పిల్లల కొనుగోలు కోరికలను ఎంతవరకు ప్రభావితం చేస్తోంది? ఇదే ఇప్పుడు ఆలోచించాల్సిన అంశం.

గేమ్ మోజులో గుల్లవుతున్న కుటుంబ బడ్జెట్లు!

జి టి ఏ - 6 ను ఆడేందుకు ప్లేస్టేషన్ 5 లేదా ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ వంటి కన్సోళ్లు అవసరం. గేమ్ కొనుగోలుతో పాటు కన్సోల్, ఇంటర్నెట్, ఇతర ఉపకరణాల ఖర్చులు కూడా ఉంటాయి. ఇప్పటికే విద్య, వైద్యం, ఇంటి ఖర్చులతో సతమతమవుతున్న కుటుంబాలకు ఇవి అదనపు భారంగా మారే అవకాశం ఉంది. నెలంతా కష్టపడి పనిచేసి జీతం అందుకునే తండ్రికి ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, వైద్య అవసరాలే పెద్ద సవాలు. తల్లి ఇంటి బడ్జెట్‌ను పొదుపుగా నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తుం టుంది. నెలవారీ ఆదాయంలో ఏ ఖర్చును తగ్గించాలి? ఏ అవసరాన్ని వాయిదా వేయాలి? అని లెక్కలు వేసుకునే ఆ కుటుంబంలోకి ఇప్పుడు ఖరీదైన గేమింగ్ పరికరాల కోరిక ప్రవేశిస్తోంది. వేలాది రూపాయల విలువైన గేమింగ్ కన్సోళ్లు, కంప్యూటర్లు, ఇతర ఉపకరణాలు కొనివ్వాలని పిల్లలు కోరితే తల్లిదండ్రులు ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఎదురవుతుంది. పిల్లల మనను నొప్పించలేక కొందరు అప్పుల గురించి ఆలోచించే ప్రమాదం ఉంది. చదువుకు అవసరమైన పుస్తకాలు, ఫీజుల కోసం ఆలోచించే కుటుంబాలు కేవలం వినోదం కోసం అప్పులు చేయాలా? కష్టార్జితాన్ని గేమింగ్ ఖర్చులకే వెచ్చించాలా? వినోదం కోసం కుటుంబ అవసరాలను పక్కన పెట్టడం ఎంతవరకు సమంజసం?

ప్రచార మాయలో బాల్యం! : సోషల్ మీడియా, యూట్యూబ్‌లో గేమింగ్ వీడియోలు, ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రచారం పిల్లలను ఆకర్షిస్తున్నాయి. తమ స్నేహితుల వద్ద ఉన్న పరికరాలు తమకూ కావాలనే పోలికలు మొదలవుతున్నాయి. గేమ్ ఆడకపోతే స్నేహితుల మధ్య చిన్నచూపు చూస్తారనే భావన కొందరిలో ఏర్పడుతోంది. క్రమంగా చదువు, ఆటపాటలు, కుటుంబంతో గడిపే సమయాన్ని పక్కనపెట్టి తెర ముందే గంటల తరబడి గడిపే అలవాటు పెరిగే ప్రమాదం ఉంది. ప్రతి గేమ్ ఆడే చిన్నారికీ ఇదే పరిస్థితి అని చెప్పలేం. కానీ నియంత్ర ణలేని గేమింగ్ అలవాట్లపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

పిల్లల కోరికలకు తల్లిదండ్రులేం సమాధానం చెప్పాలి?

స్నేహితుల దగ్గర గేమింగ్ పరికరాలు ఉన్నాయని, సోషల్ మీడియాలో అందరూ జిటిఏ గురించి మాట్లాడుతున్నారని పిల్లలు కూడా వాటిని కోరితే తల్లిదండ్రులు ఏం చేయాలి? పిల్లల కోరికలను పూర్తిగా తిరస్కరించాలా? లేక కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరించి హద్దులు విధించాలా? పిల్లలకు కావాల్సినవన్నీ అందించాలని ప్రతి తల్లిదండ్రి కోరుకుంటారు. అయితే వారి సంపాదనకు కూడా పరిమితులుం టాయి. అప్పులు చేసి పిల్లల ప్రతి కోరిక తీర్చడం ప్రేమకు నిదర్శనం కాదు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పడం కూడా తల్లిదండ్రుల బాధ్యతే. ఒక ఖరీదైన గేమింగ్ పరికరం కొనివ్వలేదని తల్లిదండ్రులపై అలక చూపడం, ఒత్తిడి చేయడం సరైన పద్ధతి కాదని పిల్లలకు చిన్నప్పటి నుంచే తెలియజేయాలి.

గేమ్ కంటే జీవితం విలువైనది! : జిటిఏ వంటి గేమ్‌లకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ ఉండొచ్చు. అవి భారీ వ్యాపార విజయాలను సాధించవచ్చు. కానీ వాటి ప్రచారాన్ని చూసి ప్రతి కుటుంబం తన స్థాయికి మించి ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా జిటిఏ-6 కు సంబంధించిన వయోపరిమితి, హింసాత్మక దృశ్యాలు, బలమైన భాష, ఇతర కంటెంట్ అంశాలను తల్లి దండ్రులు తప్పని సరిగా పరిశీలించాలి. పిల్లల వయసుకు తగిన వినో దాన్ని మాత్రమే అనుమతించాలి. చదువు, క్రీడలు, పుస్తక పఠనం, స్నేహితులతో ఆటలు, కుటుంబంతో గడిపే సమయానికి ప్రాధాన్యమివ్వాలి.

సమాజం మేల్కోవాలి.. బాల్యాన్ని కాపాడాలి! : ఇది ఒక్క కుటుంబానికి సంబంధించిన సమస్య కాదు. పిల్లల మానసిక, సామాజిక ఎదుగుదలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు, పాఠశా లలు, సమాజం కలిసికట్టుగా దృష్టి పెట్టాల్సిన అంశం. గేమింగ్ కంపెనీల ప్రచారాన్ని గుడ్డిగా అనుసరించకుండా వాటి కంటెంట్, వయో పరిమితి, ఖర్చుల గురించి అవగాహన కల్పించాలి. పిల్లల కోరికలను వినాలి.. వాటి వెనుక ఉన్న కారణాలను అర్థం చేసు కోవాలి.. అవసరమైన చోట ప్రేమతోనే హద్దులు విధించాలి. ఒక గేమ్ కోసం ప్రపంచం మొత్తం మాట్లాడుతున్న వేళ.. మధ్యతరగతి కుటుంబాలు మాత్రం ఒక ప్రశ్న వేసుకోవాల్సిన అవసరం ఉంది. గేమ్ కోసం ఖర్చు చేయాలా? పిల్లల భవిష్యత్తు కోసం దాచు కోవాలా? ప్రచారం వెనుక వ్యాపార ప్రయోజనాలెంత? యువతపై ప్రభావమెంత? పిల్లల సరదాకు కుటుంబాలే ఆర్థికంగా బలికావాలా?

చివరగా ఒక్క మాట..గేమ్‌లో గెలవడం కంటే జీవితంలో గెలవడం ముఖ్యం!

పిల్లలకు ఖరీదైన గేమింగ్ పరికరాలు కొనివ్వడం కన్నా మంచి చదువు, ఆరోగ్యకరమైన అలవాట్లు, విలువలు, అప్పలులేని కుటుంబ వాతావరణాన్ని అందించడం ఎంతో గొప్ప బహుమతి. గేమ్‌లో గెలవడం కంటే జీవితంలో గెలవడం ముఖ్యం. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన పరిస్థితి రాకూడదు. ఒక గేమ్ కోసం తండ్రి తన సంపాదనను, తల్లి తన పొదుపును త్యాగం చేయాల్సిన అవసరం రాకూడదు. పిల్లల సంతోషం ముఖ్యమే.. కానీ ఆ సంతోషం వెనుక తల్లిదండ్రుల కన్నీళు దాగి ఉండకూడదు. వినోదం అవసరమే.. కానీ అది కుటుంబ సంతోషాన్ని, పిల్లల భవిష్యత్తును మింగేసే స్థాయికి చేరకూడదు!

ఎస్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి జోసెఫ్ సుధీర్ బాబు విస్తృత ఎన్నికల ప్రచారం



సత్తెనపల్లి: రానున్న కృష్ణా - గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల నేపథ్యంలో, ఎస్టీయూ అభ్యర్థి సి.హెచ్. జోసెఫ్ సుధీర్ బాబు మంగళవారం సత్తెనపల్లి మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని అబ్బూరు, ఫణిదెం, కట్టమూరు, రెంటపాళ్ల, భృగుబండ, ధూళిపాళ్ల గ్రామాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులను కలిశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాలలో జోసెఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా ఎస్టీయూ నాయకుడిగా, రాష్ట్ర ఫ్యాప్టో చైర్మన్‌గా, ఏపీజేఏసీ సెక్రెటరీ జనరల్‌గా తాను చేసిన సేవలను గుర్తుచేశారు. ఆయా హోదాల్లో ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారులతో చర్చించి వేలాది మంది ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించానని, హక్కుల సాధన కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వహించానని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడుతున్న తనకు రానున్న ఎన్నికలలో ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎల్.వి. రామిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.ఎం. సుభానీ, జిల్లా ఆర్థిక కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని, జిల్లా కార్యదర్శి తురకా రాజు, సత్తెనపల్లి ఏరియా కార్యదర్శి వల్లూరు నాగరాజు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ జానపాటి వెంకటేశ్వర రావు, సీనియర్ నాయకులు పి. నాగవేణు, ఎ. నరేంద్ర, సత్తెనపల్లి మండల ఆర్థిక కార్యదర్శి బి.వి. బ్రహ్మేంద్ర నాయక్, గౌరవ అధ్యక్షులు మోదుగుల అప్పారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

చిన్న సహాయం... గొప్ప ప్రాణరక్షణ! మనం చేసే మంచి ఎప్పటికీ వృథా కాదు



సత్తెనపల్లి ప్రతినిధి : మానవ జీవితంలో మనిషికి ఉండాల్సిన అత్యంత గొప్ప లక్షణం దయాగుణం, ఇతరులకు సహాయం చేయాలనే మనసు. మనం చేసే చిన్న మంచి పని ఎదుటివారి జీవితంలో ఎంతటి గొప్ప మార్పును తీసుకువస్తుందో చెప్పడానికి చిన్న చీమ, దయగల పావురం కథ ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఒకరోజు ఒక చిన్న చీమ నది ఒడ్డున నీళ్లు తాగుతూ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి ప్రవాహంలో కొట్టుకుపోతుంది. ప్రాణాలు కాపాడుకోవడానికి ఎంత ప్రయత్నించినా ఆ చిన్న చీమకు సాధ్యం కాకపోవడంతో మునిగిపోతున్న సమయంలో చెట్టుపై ఉన్న ఒక పావురం ఆ దృశ్యాన్ని గమనిస్తుంది. వెంటనే స్పందించిన పావురం తన ముక్కుతో ఒక ఆకును తెంపి చీమ దగ్గర నీటిలో వేస్తుంది. ఆ ఆకు సహాయంతో చీమ దానిపైకి ఎక్కి సురక్షితంగా ఒడ్డుకు చేరుకుంటుంది. తన ప్రాణాలను కాపాడిన పావురానికి చీమ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తుంది. కొన్నిరోజుల తర్వాత ఒక వేటగాడు ఆ పావురాన్ని పట్టుకోవడానికి చెట్టు కింద మాటువేసి తన తుపాకీని గురిపెడతాడు. ఈ ప్రమాదాన్ని గమనించిన చీమ వెంటనే అప్రమత్తమై వేటగాడి కాలి దగ్గరకు వెళ్లి గట్టిగా కుడుతుంది. అనుకోని నొప్పితో వేటగాడు కేకలు వేయడంతో అతని గురి తప్పుతుంది. ఆ శబ్దానికి అప్రమత్తమైన పావురం వెంటనే రెక్కలు విప్పి అక్కడి నుంచి ఎగిరిపోయి తన ప్రాణాలను కాపాడుకుంటుంది. ఇలా ఒకప్పుడు పావురం చేసిన చిన్న సహాయం తిరిగి పావురం ప్రాణాలను కాపాడుతుంది. ఈ కథ మనకు ఒక గొప్ప జీవిత సత్యాన్ని తెలియజేస్తుంది. సహాయం చేయడానికి మన దగ్గర ఎంత సంపద ఉంది, మన స్థాయి ఎంత గొప్పది అనే విషయాలు ముఖ్యం కాదు. ఎదుటివారి కష్టాన్ని చూసి స్పందించే మంచి మనసు ఉంటే చాలు. మనం చేసే చిన్న సహాయం కూడా మరొకరి జీవితంలో వెలకట్టలేని ఆనందాన్ని నింపగలదు. ఈరోజు మనం ఎవరికైనా చేసిన మేలు రేపు మనకు మరో రూపంలో తిరిగి రావచ్చు. అందుకే ఎవరినీ తక్కువగా చూడకూడదు, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి వెనుకాడకూడదు. మనిషి గొప్పతనం అతని హోదాలోనో, ఆస్తిపాస్తుల్లోనో ఉండదు, ఇతరుల పట్ల చూపించే ప్రేమ, దయ, మానవత్వంలోనే ఉంటుంది. చిన్న చీమ మనకు నేర్పిన ఈ గొప్ప పాఠం ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలి. మనం చేసే చిన్న సహాయం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపగలదు. మంచి మనసుతో చేసే ప్రతి సహాయం ఎప్పటికైనా మంచి ఫలితాన్ని ఇస్తుంది.

తల్లిని హత్య చేసిన కుమారుడు అరెస్ట్

రిమాండ్‌కు తరలించిన పోలీసులు



ముప్పాళ్ళ : కుటుంబ కలహాల నేపథ్యంలో కన్నతల్లిని దారుణంగా హత్య చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే ముప్పాళ్ళ మండలం, మాదల గ్రామానికి చెందిన ఆకుల సీతారావమ్మ (60)ను ఆమె చిన్న కుమారుడు ఆకుల అక్షయ్ అజయ్ అలియాస్ బాజీ (37) గత శనివారం గొంతు కోసి హత్య చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మాదల గ్రామ శివారులో బాజీ సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో, సత్తెనపల్లి రూరల్ సీఐ పి. కిరణ్, ముప్పాళ్ళ ఎస్ఐ పి. అనిల్ కుమార్ తమ సిబ్బందితో కలిసి అతడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ కృష్ణ చైతన్య వివరాలను వెల్లడిస్తూ.. తన భార్యను కాపురానికి తీసుకు రావాలంటూ బాజీ తరచూ తల్లిని వేధించేవాడని, ఈ క్రమంలో తలెత్తిన కుటుంబ కలహాలే ఈ హత్యకు దారితీశాయని తెలిపారు. అనంతరం నిందితుడిని సత్తెనపల్లి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఉల్లం పలుకు :



మీ ఓట్లు కొనేది అధికారం చేపట్టేది ప్రకృతి సంపదను
దోచేందుకే కొండలు గుట్టలు ఇంకా దొరికిందల్ల అధికారం
ముసుగులో అమ్ అమ్ ఇక మిము అప్పలపాలు
చేసెందుకే అభివృద్ధిని అటకెక్కించేందుకే
నిరుద్యోగం మీఇంట సేదతీరేందుకే
పొరసేవలు ఎంచక్కా మీరు కొనుక్కునేందుకే
వెరసి అవినీతి నీతిని దహిస్తూ ప్రజాస్వామ్యాన్ని తగలెడుతూ
రాజ్యాంగాన్ని అలంకారప్రాయం గా ఆచరిస్తూ మిమ్ము
అధోగతిపాలు చేసెందుకే సిగ్గుంటే మారు లేదా
తారుమారేఒకరు గుండు చేస్తే మరొకరు బోడుగుండే!"



- ఉల్లం శేషగిరిరావు
అడ్వకేట్, హైకోర్టు & సామాజిక విశ్లేషకులు

తల్లిదండ్రులు లేని విద్యార్థులకు చలి కోట్ల పంపిణీ




వినుకొండ: పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం నందు సత్తెనపల్లికి చెందిన 'హెల్ప్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో, దాతల సహకారంతో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు చలి కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బెల్లంకొండ లక్ష్మీ ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. చదువును మించిన సిరిసంపదలు లేవని, విద్యార్థులకు చదువే అతిపెద్ద ఆస్తి అని పేర్కొన్నారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఒక వ్యక్తిని మార్చే శక్తి కేవలం చదువుకు మాత్రమే ఉందన్నారు. చదువుకున్న వ్యక్తికి సమాజంలో ఎప్పుడూ గుర్తింపు, గౌరవం లభిస్తాయని, విద్య ద్వారా ఒక మంచి స్థాయికి చేరుకుంటే ఆ తర్వాత మూడు తరాలు బాగుపడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు శ్రీలత, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు లేని సమాజమే లక్ష్యం: ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్



క్రోసూరు : బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడూ బాధ్యతగా కృషి చేయాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ పిలుపునిచ్చారు. బాలల హక్కుల దినోత్సవం మరియు 'బాల్య వివాహ ముక్త్ భారత్' ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం క్రోసూరు ప్రాజెక్టు, దొడ్లేరు సెక్టార్ పరిధిలోని పెరికపాడు తండా అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణీలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శిఖా శాంసన్ మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి పౌరుడిలాగే ప్రతి బాలబాలికకూ జీవించే, రక్షణ పొందే, స్వేచ్ఛగా అభివృద్ధి చెందే, సమాజంలో భాగస్వామ్యం పొందే హక్కులు ఉన్నాయని వివరించారు. బాల కార్మిక వ్యవస్థ, వేధింపులు, వివక్ష, దోపిడీ వంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా ఆపద ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా అధికారులకు తెలియజేయాలని, బాలల రక్షణ కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని తెలిపారు.
ప్రధానాంశాలు: 18 ఏళ్ల లోపు బాలికలకు, 21 ఏళ్ల లోపు బాలురుకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, మానసిక వికాసం, భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ (గుడ్ టచ్, బ్యాడ్ టచ్) మధ్య తేడాను గుర్తించడం, అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండటం, అసౌకర్య పరిస్థితులు ఎదురైతే నమ్మకమైన పెద్దలకు చెప్పడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. అనంతరం బాల్య వివాహాల నిరోధక ర్యాలీ నిర్వహించి, వాటి నిర్మూలనకు కట్టుబడి ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మాధవి భాయ్, నిర్మల, ఆశా కార్యకర్త విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో ఇంజినీరింగ్ విద్యార్థిని



నరసరావుపేట: బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న కొత్తమద్ది జాహ్నవి మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచింది. ప్రకాష్ నగర్‌లోని 16వ వార్డు నుంచి ఆమె వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆమె తండ్రి లక్ష్మారెడ్డి పట్టణంలో నిత్యావసరాల షాపు నిర్వహిస్తుండగా తల్లి గృహిణి. జాహ్నవి హైదరాబాదులోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతూ బిట్స్ పిలానీతో ఒప్పందంతో పార్ట్ టైమ్ ఉద్యోగం చేస్తున్నారు. ఆమె మాట్లాడుతూ తాను ఓ మార్పుకోసం రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. స్వయంగా ప్రజల సమస్యలు తెలుసుకొని అవి పరిష్కారం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తనకు వార్డు ప్రజలు మద్దతు పలకాలని కోరారు.

ముస్లిం మహిళలు రాజకీయాలతో పాటు ప్రజా ఉద్యమాల్లోనూ ముందుకు రావాలి

ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి



గుంటూరు: ముస్లిం మహిళలు రాజకీయ రంగంలోనే కాకుండా ప్రజా ఉద్యమాల్లోనూ చురుకైన పాత్ర పోషిస్తూ ముందుకు రావాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి పిలుపునిచ్చారు. స్థానిక మాయా బజార్‌లోని ముస్లిం హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరు నగర మహిళా విభాగం అధ్యక్షురాలిగా నల్లచెరువుకు చెందిన మహబూబ్ బీని, గుంటూరు జిల్లా రూరల్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పత్తిపాడు గ్రామానికి చెందిన షేక్ షాజహాన్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఖాజావలి మాట్లాడుతూ, నేడు ముస్లింలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారం కోసం శాంతియుత ప్రజా ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీలు ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని, ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇస్తున్నప్పటికీ వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. నామినేటెడ్, రాజకీయ పదవుల కేటాయింపులో ముస్లింలకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని, సంక్షేమ పథకాల అమలులో వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అర్హులైన ముస్లింలకు రుణాల పంపిణీ సక్రమంగా జరగడం లేదని పేర్కొన్నారు. ముస్లిం సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై మహిళలు కూడా తమ గళాన్ని వినిపించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. మహిళలు స్వచ్ఛందంగా ముస్లిం హక్కుల పోరాట సమితిలో చేరడం శుభపరిణామమని, వారికి సముచిత స్థానం కల్పించి, హక్కుల సాధన కోసం జరిగే పోరాటాల్లో భాగస్వాములను చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముస్లిం హక్కుల పోరాట సమితి గుంటూరు నగర అధ్యక్షులు షేక్ సిరాజ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి నూతనంగా నియమితులైన మహబూబ్ బీ, షేక్ షాజహాన్‌లకు నియామక పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు షేక్ షాకీర్, షేక్ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఫ్లోరోసిస్ స్క్రీనింగ్



కోసూరు: క్రోసూరు మండలం గరికపాడు ప్రాథమిక పాఠశాలలో గురువారం మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు ఫ్లోరోసిస్ వ్యాధిపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ మరియు నివారణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.
ఈ సందర్భంగా దొడ్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ మేరీ శ్రీకళ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రక్షిత మంచినీటిని మాత్రమే తాగాలని సూచించారు. ఫ్లోరోసిస్ నివారణకు పాలు, పెరుగు, జున్ను, బెల్లం, పచ్చటి ఆకుకూరలు, జీలకర్ర, మునగకాడలు వంటి క్యాల్షియం అధికంగా ఉండే పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. వీటితో పాటు ఉసిరి, జామ, నిమ్మ, నారింజ, టమాటా వంటి విటమిన్-సి ఉన్న ఆహార పదార్థాలను కూడా తీసుకోవాలని వివరించారు.
అనంతరం ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ, ఫ్లోరైడ్‌తో కలుషితమైన నీటిని తాగడం వల్ల దంతాలు పసుపు లేదా గోధుమ రంగులోకి మారి, క్రమంగా నల్లబడతాయని చెప్పారు. ముఖ్యంగా చిన్నపిల్లలు దంత ఫ్లోరోసిస్ వ్యాధికి ఎక్కువగా గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో భాగంగా మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ దివ్య జ్యోతి విద్యార్థులకు కాయిన్ టెస్ట్, చిన్ టెస్ట్, స్ట్రెచ్ టెస్ట్‌ల ద్వారా ఫ్లోరోసిస్ లక్షణాలను గుర్తించే పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్త కామేశ్వరి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎవరి దర్జా వారిది... ఎవరి ప్రత్యేకత వారిది!



సత్తెనపల్లి ప్రతినిధి : పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు అనే సామెత వెనుక ఎంతో గొప్ప జీవిత సత్యం దాగి ఉంది. మనిషి జీవితంలో ఎదగాలనే ఆశ ఉండాలి, ఉన్నత స్థాయికి చేరుకోవాలనే పట్టుదల ఉండాలి. కానీ ఎదగాలనే ప్రయత్నంలో మనకున్న ప్రత్యేకతను మర్చిపోయి, ఎదుటివారిని గుడ్డిగా అనుకరించడం మాత్రం ఎప్పటికీ మంచిది కాదు. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం, ఒక ప్రత్యేకమైన ప్రతిభ, ఒక ప్రత్యేకమైన స్థానం ఉంటాయి. వాటిని గుర్తించకుండా ఇతరులలా పోల్చుకుంటూ, వారిలాగే మారాలని ప్రయత్నిస్తే చివరికి మన ఉనికినే మనం కోల్పోయే ప్రమాదం ఉంది.
అనగనగా ఒక పెద్ద అడవి ఉండేది. ఆ అడవిలో ఎన్నో రకాల జంతువులు నివసించేవి. ఆ అడవికి పెద్దపులి అంటే ప్రత్యేకమైన గౌరవం, భయం. దాని నడకలో రాజసం, చూపులో గంభీరత్వం, శరీరంపై అందమైన నల్లటి చారలు దానికి ప్రత్యేకమైన ఆకర్షణను తీసుకొచ్చేవి. అడవిలో ఏ జంతువును చూసినా పులి కనిపిస్తే దానికి దారి ఇచ్చేవి. పులి హోదా, దర్జా చూసి మిగతా జంతువులు ఆశ్చర్యపోయేవి. అదే అడవిలో ఒక నక్క ఉండేది. ఆ నక్కకు ఎప్పుడూ ఇతరులను చూసి అసూయపడటం, వారిలాగే తాను కూడా ఉండాలని ఆశపడటం అలవాటు. ఒకరోజు పులిని చూసిన నక్క మనసులో ఒక విచిత్రమైన ఆలోచన వచ్చింది. పులికి ఒంటిపై చారలు ఉన్నాయి కాబట్టి అందరూ గౌరవిస్తున్నారు, తన ఒంటిపై కూడా అలాంటి చారలు ఉంటే తనకూ అదే గౌరవం దక్కుతుందని అనుకుంది. వెంటనే నల్లటి రంగు తెచ్చుకుని తన శరీరంపై పులిలాగా చారలు గీసుకుంది. అలా తన రూపాన్ని మార్చుకుని అడవిలోకి గర్వంగా అడుగుపెట్టింది. అయితే కొద్దిసేపటికే వర్షం మొదలైంది. వర్షపు నీటికి నక్క ఒంటిపై వేసుకున్న రంగంతా కరిగిపోయి అసలు రూపం బయటపడింది. అది చూసిన మిగతా జంతువులు నవ్వడంతో నక్క తీవ్రంగా అవమానపడింది. అయినా తన ప్రయత్నాన్ని వదులుకోలేదు. ఈసారి రంగులు వేస్తే సరిపోదని, శాశ్వతంగా పులిలాంటి చారలు ఉండాలని మరో ప్రమాదకరమైన ఆలోచన చేసింది. ఎర్రగా కాలిన ఇనుప కడ్డీతో తన వీపుపై పులి చారల మాదిరిగా వాతలు పెట్టించుకుంది. తీవ్రమైన నొప్పితో విలవిలలాడిపోయింది. తనకు తానే తీరని బాధను తెచ్చుకుంది. మరుసటి రోజు నీటిలో తన ప్రతిబింబాన్ని చూసుకుని తన పరిస్థితికి తానే బాధపడింది. అదే సమయంలో అటుగా వచ్చిన పెద్దపులి నక్క పరిస్థితిని గమనించి అసలు విషయం తెలుసుకుంది. అప్పుడు పులి నక్కతో ఇలా చెప్పింది. ఓరి నక్కా! నా ఒంటిపై ఉన్న చారలు నేను పుట్టినప్పటి నుంచి సహజంగా వచ్చినవి. అవి నా ప్రత్యేకతలో ఒక భాగం మాత్రమే. నా గౌరవానికి కారణం కేవలం నా శరీరంపై ఉన్న చారలు కాదు. నా బలం, నా ధైర్యం, నా సహజమైన స్వభావం, నా వ్యక్తిత్వం, నా జీవన విధానం నన్ను ప్రత్యేకంగా నిలబెట్టాయి. నువ్వు నక్కవి కాబట్టి నీకంటూ ఒక ప్రత్యేకత ఉంది. నీ తెలివితేటలను ఉపయోగించుకుని నీ స్థాయిలో నువ్వు ఎదగాలి. అంతేకానీ నన్ను చూసి నువ్వు నాలా మారాలని ప్రయత్నిస్తే నీకు మిగిలేది బాధ, అవమానం, నష్టం మాత్రమే అని హితవు పలికింది. పులి చెప్పిన మాటలు నక్కకు కనువిప్పు కలిగించాయి. అప్పుడే తన తప్పు తెలుసుకుంది. ఇతరుల్లా మారడం కంటే తనలో ఉన్న ప్రత్యేకతను గుర్తించుకుని జీవించడమే గొప్పతనమని అర్థం చేసుకుంది.
ఈ కథ కేవలం ఒక నక్క, పులికి సంబంధించిన కథ మాత్రమే కాదు. మన చుట్టూ ఉన్న సమాజానికి, మనుషుల జీవితాలకు అద్దం పట్టే గొప్ప సందేశం. నేటి ప్రపంచంలో చాలామంది ఇతరుల హోదాను చూసి అసూయపడుతున్నారు. ఇతరుల విజయాలను చూసి తమ జీవితాలను తక్కువగా అంచనా వేసుకుంటున్నారు. ఎవరో ఒకరు గొప్ప స్థాయిలో ఉన్నారని, వారిలాగే దుస్తులు ధరించాలని, వారిలాగే మాట్లాడాలని, వారిలాగే జీవించాలని ప్రయత్నిస్తున్నారు. కానీ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఎదుటివారి విజయాన్ని చూసి స్ఫూర్తి పొందడం మంచిదే కానీ, వారి వ్యక్తిత్వాన్ని కాపీ చేయడం మంచిది కాదు. అనుకరించడం ద్వారా కొంతకాలం గుర్తింపు రావచ్చు కానీ సొంత ప్రతిభతో సంపాదించుకున్న గౌరవం మాత్రమే జీవితాంతం నిలిచిపోతుంది. పక్కవారి ఎదుగుదలను చూసి కుళ్లిపోవడం కంటే మన ఎదుగుదల కోసం కష్టపడాలి. ఇతరుల స్థానాన్ని ఆశించడం కంటే మనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకోవాలి. ఇతరుల వెలుగులో కనిపించడం కంటే మన ప్రతిభతో మనమే వెలుగుగా మారాలి. ఎందుకంటే ఈ ప్రపంచంలో ఎవరి ప్రయాణం వారిది, ఎవరి పోరాటం వారిది, ఎవరి విజయం వారిది. ఒక పువ్వు అందం మరొక పువ్వులో ఉండదు. ఒక చెట్టు గొప్పతనం మరో చెట్టుతో పోల్చి నిర్ణయించలేం. అలాగే ప్రతి మనిషిలోనూ ఒక ప్రత్యేకమైన శక్తి ఉంటుంది. దాన్ని గుర్తించి సరైన దిశలో ఉపయోగించుకున్నప్పుడే నిజమైన విజయం సాధ్యమవుతుంది. కాబట్టి ఎప్పుడూ ఇతరులతో పోల్చుకోవద్దు, అసూయకు చోటివ్వద్దు, గుడ్డిగా అనుకరించవద్దు. నీలో ఉన్న ప్రతిభను నమ్ము, నీ ఆత్మవిశ్వాసాన్ని పెంచుకో, నీ కష్టాన్ని నమ్ముకుని ముందుకు సాగు. గుర్తుంచుకో... పులి పులిలాగే గొప్పది, నక్క నక్కలాగే ప్రత్యేకమైనది. ఎవరి దర్జా వారిది, ఎవరి స్థాయి వారిది, ఎవరి ప్రత్యేకత వారిది. ఇతరుల్లా మారాలని ప్రయత్నించి నీ అసలైన వ్యక్తిత్వాన్ని కోల్పోకు. నీకంటూ ఒక గుర్తింపును సృష్టించుకో. ఎందుకంటే ప్రపంచం ఎప్పటికీ అసలైన వ్యక్తిత్వాన్నే గుర్తిస్తుంది కానీ అనుకరణను కాదు. ఇతరులను చూసి మారిపోవడం గొప్పతనం కాదు... మనలోని ప్రత్యేకతను గుర్తించి మనమే ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా ఎదగడమే నిజమైన గొప్పతనం.

ప్రకృతి ప్రకోపం.. 30 ఏళ్లలో 9 లక్షల మంది మృతి

ఢిల్లీ : ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రపంచవ్యాప్తంగా గడిచిన 30 ఏళ్లలో 9 లక్షల మంది మరణించినట్లు జర్మనీకి చెందిన పర్యావరణ సంస్థ తన నివేదికలో పేర్కొంది. 5.5 బిలియన్ల మంది ప్రభావితమైనట్లు తెలిపింది. తుర్కియేలో జరుగుతోన్న కాప్ 31 సదస్సులో భాగంగా 'క్లైమేట్ రిస్క్ ఇండెక్స్-2027' పేరుతో నివేదిక విడుదల చేసింది. ఈ కారణంగా ప్రపంచ దేశా లకు 4.7 ట్రిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక నష్టాలూ వాటిల్లి నట్లు తెలిపింది. 1996 నుంచి 2025 వరకు వాతావరణ మార్పులతో ప్రభావితమైన దేశాల జాబితాలో భారత్ 10వ స్థానంలో ఉందని.. 78,000 మంది చనిపోయినట్లు ఆ నివేదిక తెలిపింది.
దారుణంగా పేద దేశాల పరిస్థితి.. 1996-2025 మధ్యకాలంలో ప్రపంచ దేశాల్లో వడగాలులు, ఉష్ణమండల తుపానులు, భారీ వర్షాలు, వరదలతో సహా దాదాపు 10వేల వాతావరణ విపత్తులు సంభవించాయి. ఈ సమయంలో పేద దేశాలు దారుణ పరిస్థితులు ఎదుర్కొన్నాయి. అత్యంత ప్రభావిత దేశాలలో మొదటి స్థానంలో డొమినికా ఉండగా.. ఆ తర్వాత స్థానాల్లో మయన్మార్, హోండురాస్ ఉన్నాయి. గతేడాది సంభవించిన విపత్తులకు జమైకా, శ్రీలంక, స్పెయిన్‌లు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయి. వాటి తర్వాత స్థానాల్లో థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్, పాకిస్థాన్ ఉన్నాయి. 'కేటగిరీ 5' హరికేన్ మెలిస్సా జమైకాలో 62 మందిని బలిగొంది. దీంతో ఆ ఏడాది దేశ జీడీపీలో దాదాపు

పోషకాహారతోనే ఆరోగ్యం



ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో మందులతోపాటు ఆహారం కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా కూరగాయల్లో ఉండే విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి అవసరమైన పోషకాలను అందించి అనేక ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. కొన్ని కూరగాయలను క్రమం తప్పకుండా ఆహారంలో చేర్చుకోవడం వల్ల కాలేయ ఆరోగ్యం, రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి వంటి అంశాలకు మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కాలేయంలో కొవ్వు పేరుకుపోయే ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు కాలీఫ్లవర్‌ను ఆహారంలో చేర్చుకోవచ్చు. ఇందులో ఉండే ఇండోల్స్, గ్లూకోసినోలేట్స్ వంటి సమ్మేళనాలు కాలేయం సహజంగా వ్యర్థాలను తొలగించడంలో తోడ్పడి, కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

బీట్‌రూట్, కాకరకాయ, పాలకూర..

రక్తపోటు ఉన్నవారికి బీట్‌రూట్ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులో ఉండే సహజ నైట్రేట్లు శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌గా మారి రక్తనాళాలను విస్తరించడంలో సహాయపడతాయి. దీంతో రక్తప్రసరణ మెరుగుపడి రక్తపోటు నియంత్రణకు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నవారు కాకరకాయను ఆహారంలో చేర్చుకోవడం మంచిది. ఇందులో ఉండే పాలీపెప్టైడ్-పీ, కారంటిన్ వంటి సమ్మేళనాలు సహజ ఇన్సులిన్ మాదిరిగా పనిచేసి గ్లూకోజ్ నియంత్రణకు దోహదపడతాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో ఐరన్ లోపం ఉన్నవారికి పాలకూర మంచి ఎంపిక. ఇందులో ఐరన్‌తోపాటు ఫోలేట్ కూడా సమృద్ధిగా ఉంటుంది. ఇవి ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరం. పాలకూరతోపాటు నిమ్మరసం వంటి విటమిన్ సి అధికంగా ఉండే పదార్థాలను తీసుకుంటే ఐరన్ శోషణ మరింత మెరుగుపడుతుంది.

ముల్లంగి, క్యారెట్..

జీర్ణక్రియ సమస్యలు ఉన్నవారికి ముల్లంగి ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే పీచుపదార్థం మలబద్ధకాన్ని తగ్గించి పేగుల పనితీరును మెరుగుపరుస్తుంది. అలాగే పిత్తరసం విడుదలను ప్రోత్సహించడం ద్వారా కొవ్వు జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది. కంటి ఆరోగ్యానికి క్యారెట్ ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే బీటా కెరోటిన్ శరీరంలో విటమిన్ ఎగా మారి కంటి చూపును కాపాడటంలో, కంటి ఉపరితలాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు క్యాప్సికమ్‌ను ఆహారంలో చేర్చుకోవచ్చు. ఇందులో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఈ పోషకం తెల్ల రక్తకణాల ఉత్పత్తిని పెంచి ఇన్ఫెక్షన్లతో పోరాడేందుకు శరీరానికి సహాయపడుతుంది.

తోటకూర, ఉసిరి..

చర్మం కాంతివంతంగా ఉండేందుకు తోటకూర ఉపయోగపడుతుంది. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటంతో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించి చర్మానికి సహజమైన మెరుపును అందించడంలో తోడ్పడుతుంది. ఉసిరికాయను పోషకాహార నిపుణులు సూపర్‌ఫుడ్‌గా పేర్కొంటున్నారు. ఇందులో నారింజ రసం కంటే ఎన్నో రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉండటంతో రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా జుట్టు, గుండె ఆరోగ్యం, జీవక్రియకు కూడా మేలు చేస్తుంది. అయితే ఈ కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేసినప్పటికీ, ఇవి వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కావని గుర్తుంచుకోవాలి. ఇప్పటికే ఏదైనా వ్యాధికి చికిత్స పొందుతున్నవారు వైద్యుల సూచనల మేరకు మందులు కొనసాగిస్తూ, సమతుల్య ఆహారంలో భాగంగా ఈ కూరగాయలను చేర్చుకోవడం ఉత్తమమని నిపుణులు తెలియజేస్తున్నారు.



ఏడాదంత పుణ్యం!

జ్యేష్ఠ మాసం శుక్ల పక్షంలో వచ్చే ద్వాదశిని రామలక్ష్మణ ద్వాదశి అనీ, చంపక ద్వాదశి అనీ అంటారు. వరాహ పురాణం ప్రకారం ప్రతినెలా శుక్లపక్షంలో వచ్చే ద్వాదశి విశేషమైనదే! జ్యేష్ఠ మాసంలో వచ్చే శుక్ల ద్వాదశి నాడు మహావిష్ణువు అవతారమైన శ్రీరామచంద్రుడిని పూజించాలని సూత మహర్షి చెప్పినట్టుగా వరాహ పురాణ కథనం. ఈ సందర్భంగా జ్యేష్ఠ ఏకాదశి నాడు బంగారంతో చేయించిన (శక్తి ఉన్నవారు) రామలక్ష్మణ విగ్రహాలను పూజించి, మర్నాడు అంటే ద్వాదశి నాడు వాటిని దానంగా ఇవ్వాలని ధర్మశాస్త్ర వచనం. ఆర్థికంగా శక్తిలేని వారు మట్టి ప్రతిమలను పూజించి కూడా దానమివ్వొచ్చు. శ్రీరాముడు విష్ణుమూర్తి స్వరూపుడైతే, లక్ష్మణుడు ఆదిశేషుడి రూపం. ఈ ఉభయులను ప్రత్యేకంగా ఆవాహన చేసి పూజించడం వల్ల గవామయన యాగం చేసిన ఫలితం కలుగుతుందని పెద్దల మాట. ఒక ఏడాది పాటు నిర్విఘ్నంగా యాగం చేయడాన్ని గవామయన యాగం అంటారు. కేవలం రామలక్ష్మణ ద్వాదశి నాడు వారిద్దరినీ పూజించడం వల్ల అంతటి గొప్ప పుణ్యం లభిస్తుందని ప్రతీతి. జగద్గురువు ఆదిశంకరాచార్యులు అవతార పరిసమాప్తి గావించింది కూడా ఈ రోజునే! ఈ క్రమంలో ద్వాదశి నాడు ఆదిశంకరుల ధ్యానం వల్ల ఆయన అనుగ్రహం కూడా లభిస్తుంది.

శాకాహార నగరంగా మారనున్న వారణాసి!



వారణాసి : ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నగరం త్వరలో శాకాహార నగరంగా మారనుంది! ఆ నగర మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) తన పరిధిలోని మాంసం, చేపలు, కోళ్ల దుకాణాలను నగర శివార్లకు తరలించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా నగర పరిధిలో ఉన్న 350 నుంచి 400 మాంసం దుకాణాలను రాబోయే ఆరు నెలల్లో విడతల వారీగా దీపావళి లోపు శివార్లకు తరలించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ దుకాణాలను రామ్‌నగర్, సుజాబాద్, గణేశ్‌పూర్, అవలేష్ నగర్, శివపూర్ ప్రాంతాలకు తరలించనున్నారు. దీంతో కాశీ నగరం దేశంలోని రెండవ శాకాహార నగరంగా మారనుంది. ప్రస్తుతం ప్రపంచంలోని ఏకైక పూర్తి శాకాహార పట్టణంగా గుజరాత్‌లోని 'పాలితానా' గుర్తింపు పొందింది. ఇక్కడ 2014 నుంచి మాసం, చేపలు, గుడ్ల విక్రయాలపై నిషేధం అమల్లో ఉంది. వారణాసిలో హిందువులు 72 శాతం, ముస్లింలు 27 శాతం ఉన్నారనే అంచనాలున్నాయి.

'ఎగిరే రాడార్'కు లైన్ క్లియర్



బెంగళూరు: శత్రువుల క్షిపణులు, డ్రోన్లు, విమానాలను ఓ కంట కనిపెడుతూ భూతలం మీది భారత బలగాలకు సమాచారం చేరవేసి అప్రమత్తంచేసే 'ఆకాశ రాడార్'గా రికార్డ్ నెలకొల్పనున్న భారత తొలి స్వదేశీ ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ 'నేత్ర'భారత వాయుసేన చేతికొచ్చింది. ఇకపై ఈ వ్యవస్థతో అత్యంత ఎత్తుల్లో ప్రయాణించే విమానాన్ని రణక్షేత్రంలో వినియోగించుకునేందుకు రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ తుది అనుమతి మంజూరుచేసింది.

సంబంధిత ఫైనల్ ఆపరేషన్ క్లియరెన్స్(ఎఫ్ఓసీ) సర్టిఫికేట్‌ను భారత వాయుసేనకు గురువారం డీఆర్‌డీవో అందజేసింది. బెంగళూరులో జరిగిన ఈ కార్యక్రమంలో ఎయిర్ స్టాఫ్ డెప్యూటీ చీఫ్, ఎయిర్ మార్షల్ అవధేశ్ కుమార్ భారతి పాల్గొని ప్రసంగించారు. "ఏఈడబ్ల్యూసీకి తుది అనుమతి రావడం ఎంతో గర్వంగా ఉంది. ఇది కేవలం ఆరంభం మాత్రమే కాదు గగనతల రక్షణంలో భారత వాయుసేన సాధించబోయే స్వావలంభన, ఆత్మనిర్భరతకు ఇది మరో ముందడుగు.

ఎర్లీ వార్నింగ్ వ్యవస్థ ప్రస్థానం అసాధారణం. ఎన్నో సవాళ్లను అధిగమించి ఇక్కడి దాకా వచ్చాం. ఇంకా ఎన్నో ఆవిష్కరణలు చేయాల్సి ఉంది. భారత వాయుసేన, డీఆర్‌డీఓ, సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టిమ్స్ తదితర విభాగాల శాస్త్రవేత్తల సమష్టి కృషికి సంబరం చేసుకోవాల్సిన రోజు ఇది"అని ఆయన అన్నారు.

ఏఈడబ్ల్యూసీ అనేది విమానంలో ఉండే పలు రకాల సెన్సార్ల సమాహారం. ఇందులో రాడార్, ఎలక్ట్రానిక్ యుద్ధతంత్ర వ్యవస్థలు, అత్యంత భద్రమైన కమ్యూనికేషన్ వ్యవస్థలు ఉంటాయి. ఈ విమానాన్ని శత్రువులు గుర్తిస్తే శత్రు దాడుల నుంచి తనను తాను కాపాడుకునే రక్షణ వ్యవస్థలూ ఈ విమానంలో ఉంటాయి. భవిష్యత్తులో నేత్రా వ్యవస్థను ఆరు విమానాల్లో అమర్చనున్నారు.

భారత్‌లో 2031 వన్డే ప్రపంచకప్

బాలి: ఐసీసీ 2035 వరకు మేజర్ టోర్నమెంట్ల షెడ్యూలును ఆదివారం ధ్రువీకరించింది. భారత్ 2029 ఛాంపియన్స్ ట్రోఫీ, 2031 వన్డే ప్రపంచకప్‌లకు ఆతిథ్యమివ్వనుంది. 2006 తర్వాత భారత్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుండడం ఇదే తొలిసారి. ఈ టోర్నీని 2029 అక్టోబరు 9 నుంచి 28 వరకు నిర్వహిస్తారు. 2031 ప్రపంచకప్ అక్టోబరు 9 నుంచి నవంబరు 23 వరకు జరుగుతుంది. ఈ టోర్నీకి బంగ్లాదేశ్ సహ ఆతిథ్య దేశం. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో 2028 టీ20 ప్రపంచకప్, ఇంగ్లాండ్‌లో 2030 టీ20 ప్రపంచకప్, 2031 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ జరుగుతాయి. 2031 తర్వాతి జరిగే టోర్నీల ఆతిథ్య దేశాలను ఇంకా ఖరారు చేయలేదు. 2032లో టీ20 ప్రపంచకప్, 2033లో డబ్ల్యూటీసీ ఫైనల్, 2033లో ఛాంపియన్స్ ట్రోఫీ, 2034లో టీ20 ప్రపంచకప్, 2035లో డబ్ల్యూటీసీ ఫైనల్, 2035లో వన్డే ప్రపంచకప్ జరుగుతాయి.

సోనియాగాంధీ పాత్రలో 'ప్రపంచ అందగత్తె'..

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఆత్మకథ ఇటీవల విడుదల కావడంతో ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర అంశాలు వార్తల్లో నిలిచాయి. ఈ సమయంలో మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. 2006లో సోనియా గాంధీ జీవితం ఆధారంగా ఒక సినిమా తీయాలనుకున్నారు. అందులో నటించేందుకు 'ప్రపంచ అందగత్తె'ను ఎంపిక చేశారు. మరి ఆ సినిమా వచ్చిందా..?

సోనియాగా మోనికా..

ఈ నెల 10న 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' విడుదలైన సంగతి తెలిసిందే. దీనికి సరిగ్గా 20 ఏళ్ల క్రితం 'ఇటాలియన్ దివా' మోనికా బెలూచి 'సోనియా'గా ఎంపికయ్యారు. కాంగ్రెస్ అగ్ర నాయకురాలి రాజకీయ ప్రస్థానం ఆధారంగా జర్నలిస్టు రషీద్ కిద్వాయ్ రాసిన 'సోనియా: ఏ బయోగ్రఫీ' పుస్తకం 2003లో విడుదలైంది. అమెరికాలో స్థిరపడిన భారతీయ దర్శకుడు జగన్మోహన్ ముంద్రా, నిర్మాత సునంద మురళీ మనోహర్ ఈ పుస్తకాన్ని సినిమాగా తీసుకురావాలని అనుకున్నారు. ఈ చిత్రం పేరును 'సోనియా'గా నిర్ణయించారు. టైటిల్ పాత్రలో నటించేందుకు మోనిక సంతకం చేశారని నాడు అధికారిక ప్రకటన కూడా వచ్చింది.

లీగల్ నోటీసులతో..

అయితే, సినిమా షూటింగ్ ప్రారంభం కావడానికి 60 రోజుల ముందు కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. సినిమాలో వాస్తవాలను వక్రీకరించే అవకాశం ఉందంటూ నిర్మాతలకు లీగల్ నోటీసులు పంపింది. నాడు జగన్మోహన్ ముంద్రా దీనిపై స్పందించారు. "నా దగ్గర ఉన్న స్క్రిప్ట్‌లో వివాదాస్పద అంశాలు ఏమీ లేవు. ఒక వ్యక్తిగా సోనియాగాంధీ పట్ల నాకు అత్యంత గౌరవం ఉంది. ఇటలీలో పుట్టి పెరిగిన ఒక అమ్మాయి.. విభిన్న మతాలు, జాతులకు నెలవైన దేశంలో అగ్ర రాజకీయ నాయకురాలిగా ఎదుగుతారని ఎవరూ ఊహించి ఉండరు. అందుకే ఆ అంశాల ఆధారంగా సినిమా తీయాలని నాకు ఆసక్తి కలిగింది" అని దర్శకుడు వెల్లడించారు.

ఆ తర్వాత కూడా సినిమా తెరకెక్కించేందుకు పలుమార్లు ఆసక్తి వ్యక్తం చేసిన ఆయన.. 2011లో మరణించారు. దాంతో 'సోనియా' చిత్రం అక్కడితో ఆగిపోయింది. ఇక, ఈ సినిమా గురించి మోనికా బెలూచి ఓ సందర్భంలో మీడియాతో మాట్లాడారు. "ఒక భారతీయ చిత్రంలో సోనియాగాంధీ పాత్ర పోషించమని నన్ను సంప్రదించిన




మాట వాస్తవమే. అయితే నాకు స్క్రిప్ట్ నచ్చకపోవడంతో నేను ముందుకు వెళ్లలేకపోయాను" అని ఆమె చెప్పడం గమనార్హం. ఈ పాత్ర కోసం బాలీవుడ్ నటీమణులు ఐశ్వర్యారాయ్, ప్రీతిజింతా పేర్లు పరిశీలనకు వచ్చినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.

మళ్లీ 'సోనియా' సినిమా..

ప్రస్తుతం సోనియాగాంధీ ఆత్మకథ 'బిలాగింగ్' బెస్ట్ సెల్లర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ సినిమా చర్చ మొదలైంది. ఈ పుస్తకం ఆధారంగా సినిమా తీస్తానని తెలంగాణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. "పార్టీ నాయకులు డబ్బులు రెడీ చేసుకోవాలి. ప్రజలకు సోనియా జీవిత చరిత్రని సినిమా ద్వారా చూపించాలి. ఆమెది విజయవంతమైన రాజకీయ జీవితం. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా షూటింగ్ ప్రారంభిస్తా" అని జగ్గారెడ్డి పేర్కొన్న సంగతి తెలిసిందే. సోనియా పుట్టినరోజు డిసెంబర్ 9న ఈ సినిమా పనులను ప్రారంభిస్తామని, డిసెంబర్ 9, 2028లో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

ప్రముఖ నటుడు రజనీకాంత్ నటించిన 'కూలీ' చిత్రంలో నటి పూజా హెగ్డే కనిపించిన స్పెషల్ సాంగ్ 'మోనికా' ఇంటర్నెట్‌ను షేక్ చేసిన సంగతి తెలిసిందే. ఆ పాటను మోనికా బెలూచి మీద ఉన్న అభిమానంతోనే చేసినట్లు దర్శకుడు లోకేశ్ కనకరాజ్ అప్పట్లో వెల్లడించారు. మోనికా బెలూచి ప్రపంచ ప్రఖ్యాత ఇటాలియన్ నటి, మోడల్. ఇటలీ, ఫ్రెంచ్, హాలీవుడ్ చిత్రాలలో అద్భుతమైన నటన, అందంతో కట్టిపడేసే ఆమెను పలు మ్యాగజైన్లు 'ప్రపంచ అందగత్తె'గా అభివర్ణించాయి.



వైష్ణవ్ తేజ్ హీరోగా 'హనుమాన్ 2'..

టాలీవుడ్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన 'హను-మాన్' సినిమా మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'హనుమాన్ 2'ను ప్రకటించిన నిర్మాణ సంస్థ ప్రేక్షకులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. సీక్వెల్ కోసం వైష్ణవ్ తేజ్‌ను ఎంపిక చేయడంతో ఒక్కసారిగా ఈ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. 2024లో ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తేజ సజ్జా హీరోగా వచ్చిన హను-మాన్ సినిమా రికార్డులు తిరగరాసింది. దీంతో దీని సీక్వెల్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. ఈ రెండో చిత్రంపై రకరకాల వార్తలు నెట్టింట చక్కర్లు కొట్టాయి. ప్రశాంత్ వర్మకు, హనుమాన్ నిర్మాణ సంస్థకు మధ్య అభిప్రాయభేదాలు వచ్చాయని, అందుకే ఆయన మైత్రీ మూవీస్‌తో కలిసి 'జై హనుమాన్'ను ప్రకటించారని అప్పట్లో జోరుగా ప్రచారం జరిగింది. ఇప్పుడు హనుమాన్ నిర్మాణ సంస్థ తాజాగా 'హనుమాన్ 2' పేరుతో సీక్వెల్‌ను ప్రకటించడంతో ఆ ఊహాగానాలకు మరింత బలం చేకూరింది. 'హనుమాన్ 2 - ది రైజ్ ఆఫ్ వానరాస్' పేరుతో ఈ సీక్వెల్‌ను తెరకెక్కించనున్నట్లు ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ వెల్లడించింది. ఇందులో వైష్ణవ్ తేజ్ హీరోగా నటిస్తుండగా.. వీఐ ఆనంద్ దర్శకత్వం వహించనున్నట్లు తెలిపింది. "ఒక కలగా మొదలైన ప్రయాణం.. మరింత గొప్ప విజన్‌తో కొనసాగుతోంది. హను-మాన్ వారసత్వాన్ని మా తదుపరి చిత్రంతో ముందుకు తీసుకెళ్తున్నందుకు గర్వంగా ఉంది. 'హనుమాన్2'ను పరిచయం చేస్తున్నాం. వైష్ణవ్ తేజ్, ఆనంద్‌తో కలిసి అద్భుతమైన చిత్రాన్ని గొప్పగా రూపొందిస్తున్నాం" అని నిర్మాణ సంస్థ పేర్కొంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY SHAIK ABDUL GOUSE ALI, PRINTED AT USHASRI PRINTERS, 22-12-84, VOORAVARI STREET, LALAPET, GUNTUR DISTRICT. ANDHRAPRADESH.
PUBLISHED AT GUNDEPUDI VARI VEEDHI, D.NO.18-6-12/4, ACHAMPET ROAD, SATTENAPALLI, PALNADU DISTRICT. ARUNDALPETA, 13TH LINE, 3RD CROSS ROAD, D.NO.31-13-1138, GUNTUR, A.P.- 522002. EDITOR: SHAIK ABDUL GOUSE ALI.